మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

మంగళవారం 10-02-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 111

## విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

# నీటి ఎద్దడి రావొద్దు

## వేసవిలో ముందస్తు చర్యలు తీసుకోండి

- హాస్టల్ విద్యార్థులకు ఆరోగ్య సమస్యలొస్తే కలెక్టర్లు, మంత్రులదే బాధ్యత
- అంగన్‌వాడీల్లో పోషకాహారం
- సంజీవని ద్వారా జూలై నాటికి 66 లక్షల మందికి హెల్త్ స్క్రీనింగ్
- 5 లక్షల మంది హాస్టల్ విద్యార్థులకూ 12వ తరగతి వరకు 70 లక్షల మంది విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్స్ రూపొందించాలి
- టెన్త్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా వంద రోజుల యాక్షన్ ప్లాన్
- మంత్రులు, కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే: చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.

మంత్రులు, కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ఆయన వివిధ అంశాలపై ప్రభుత్వ యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, పాలసీల అమలు క్షేత్రస్థాయిలో ఎలా జరుగుతోందో ప్రత్యక్షంగా చూడాలని సూచించారు. పైస్థాయిలో ఎన్ని నిర్ణయాలు తీసుకున్నా క్షేత్రస్థాయిలో పాలసీలు అమలుకానప్పుడు ఫలితం ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించి వివిధ వర్గాల ప్రజలతో అధికారులు మాట్లాడితే చాలా సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని చెప్పారు. -మిగతా 3 లో





## జీవితంలో ఏదీ సులువుగా ఉండదు..

- విద్యార్థులు చదువుతో పాటు జీవితాన్ని కూడా ఆస్వాదించాలి
- టెక్నాలజీతో ఎలా పనిచేయాలన్నది నేర్చుకోవడం చాలా ముఖ్య
- సాంకేతికతే మిమ్మల్ని బానిసలుగా మార్చుకునే పరిస్థితికి వెళ్లొద్దు
- పరీక్షా పే చర్చలో విద్యార్థులతో మోదీ

న్యూఢిల్లీ -
సాంకేతికత మనం పనిచేసే విధానాన్ని మారుస్తుందని, దాన్ని అర్థం చేసుకుని అవసరానికి తగినట్లుగా వినియోగించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. అంతేగానీ సాంకేతికతే మిమ్మల్ని బానిసలుగా మార్చుకునే పరిస్థితికి వెళ్లొద్దని సూచించారు. 'పరీక్షా పే చర్చ ' రెండో ఎడిషన్‌లో భాగంగా పలువురు విద్యార్థులతో ప్రధాని మాట్లాడారు.ఈ సందర్భంగా కెరీర్ పురోగతికి సంబంధించి వారికి విలువైన సూచనలు చేశారు. విద్యార్థులు వెలిబుచ్చిన సందేహాలకు సమధానాలు ఇచ్చారు. క్రమశిక్షణ, ప్రేరణ ఈ రెండింటిలో ఏది ముఖ్యం..? అన్న ప్రశ్నకు.. ఆ రెండింటినీ పోల్చకూడదని అన్నారు. ఎంత స్ఫూర్తి పొందినా ఆచరణలో క్రమశిక్షణ లేకపోతే సత్ఫలితాలు పొందలేరని అన్నారు. సమయపాలన, స్థిరత్వం, స్వీయ క్రమశిక్షణే మన ప్రేరణను అర్థవంతమైన ఫలితాలుగా -మిగతా 3 లో



## నేడు అమిత్‌షాతో బాబు భేటీ

- కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, సీఆర్ పాటిల్, చౌహాన్, వైష్ణవ్‌లతోనూ ఏపీ ప్రాజెక్టులు, నిధులపై చర్చలు!
- ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి
- విమానాశ్రయ లాంజ్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన సచిన్ టెండూల్కర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.

ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. ఢిల్లీ విమానాశ్రయంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, కూటమి ఎంపీలు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఎయిర్‌పోర్ట్ లాంజ్‌లో ఆయన వారితో సమావేశమై చర్చించారు. రాష్ట్రానికి సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలు, కేంద్రం నుంచి రావలసిన నిధులు, తాజా రాజకీయ పరిణామాలపై వారికి దిశానిర్దేశం చేశారు. కాగా.. చంద్రబాబు ఢిల్లీ విమానాశ్రయంలో ఉన్నారని తెలుసుకుని.. క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ ఆయన్ను లాంజ్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వారు ఆత్మీయంగా పలుకరించుకోవడం అక్కడ అందరినీ ఆకర్షించింది. -మిగతా 3 లో



## మేం ఎవరికీ భయపడం

- యురేనియం శుద్ధిపై తగ్గేదే లేదన్న ఇరాన్
- తమను శాసించే హక్కు ఎవరికీ లేదు
- అమెరికా సైనిక మోహరింపు తమను భయపెట్టలేవు
- అమెరికా తో అణు చర్చలు జరుగుతున్న వేళ ఇరాన్ కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ -
అగ్రరాజ్యం అమెరికా తో అణు చర్చలు జరుగుతున్న వేళ ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. యురేనియం శుద్ధిపై తాము వెనక్కి తగ్గేదేలేదని స్పష్టం చేసింది. తమను ఎవరూ భయపెట్టలేరని, తాము ఎవరికీ భయపడేది లేదని అగ్రరాజ్యంపై కవ్వింపులకు పాల్పడింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బా అరాఘ్చి ఈ వ్యాఖ్యలు చేశారు.అమెరికా పై తమకు పెద్దగా నమ్మకం లేదని, యురేనియం శుద్ధిపై తామెందుకు వెనక్కి తగ్గాలని అరాఘ్చి అన్నారు. ఒకవేళ తమపై యుద్ధం ప్రకటించినా తాము దాన్ని వదిలేయబోమని చెప్పారు. తమను శాసించే హక్కు ఎవరికీ లేదన్నారు. ఈ ప్రాంతంలో వారి (అమెరికా) సైనిక మోహరింపు తమను భయపెట్టలేదని చెప్పారు. అమెరికాతో చర్చల గురించి తమ వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలైన చైనా, రష్యాను కూడా సంప్రదిస్తున్నట్లు వెల్లడించారు. ఒమన్ వేదికగా ఇరాన్, అమెరికా మధ్య ప్రస్తుతం పరోక్ష చర్చలు జరుగుతున్నాయి. -మిగతా 3 లో

## అంబటికి నోటీసులివ్వండి

- సెక్షన్ 35(3) ప్రకారం వివరణ తీసుకోండి
- పోలీసులకు హైకోర్టు ఆదేశం
- గతేడాది గుంటూరులో రెండు కేసులు నమోదు
- బైక్ ర్యాలీలో ఇన్‌స్పెక్టర్‌పై దుర్భాషణలు
- చంపేస్తామని కార్మిక నాయకుడికి బెదిరింపులు
- చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలోనూ 33 కేసుల్లో నోటీసులివ్వాలని కోర్టు ఆదేశం




అమరావతి, ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.

గతేడాది నమోదైన రెండు కేసులలో వైసీపీ నేత అంబటి రాంబాబుకు బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తమ ముందున్న రెండు కేసులలో పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనని గుర్తు చేసింది. ఫిర్యాదుదారులకు నోటీసులు జారీ చేసింది. కేసులకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. -మిగతా 3 లో

## సర్'కు అడ్డంకులు కల్పించవద్దు..

- పశ్చిమబెంగాల్‌కు సుప్రీంకోర్టు వార్నింగ్
- సర్ ప్రక్రియలో ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే తాము కల్పించుకుంటాం
- అంతేతప్ప సర్ ప్రక్రియకు అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దు
- ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలి




న్యూఢిల్లీ-
పశ్చిమబెంగాల్ లో నిర్వహిస్తోన్న 'సర్' ప్రిక్రియ ను వ్యతిరేకిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. సర్ ప్రక్రియలో ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే తాము కల్పించుకుంటామని స్పష్టంచేసింది. అంతేతప్ప సర్ ప్రక్రియకు అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దని బెంగాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలని సూచించింది.ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కోసం 300 మంది అధికారులను కేటాయించాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని కోరితే 80 మంది గ్రేడ్-2 స్థాయి అధికారులనే కేటాయించిందని న్యాయస్థానానికి ఈసీ తెలియజేసింది. మరోవైపు ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని, అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడంలేదని బెంగాల్ ప్రభుత్వం పేర్కొన్నది. ఇంటి పేర్లలో అక్షరదోషాలు, -మిగతా 3 లో

## ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారపర్వం

- 116 మున్సిపాలిటీలు ,7 మున్సిపల్ కార్పొరేషన్లలో హోరెత్తిన ప్రచారం
- 11న పోలింగ్‌కు ఎన్నికల సంఘం సర్వం ఏర్పాట్లు



హైదరాబాద్ ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.

తెలంగాణ రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రచార పర్వం ముగిసింది. చివరిరోజు ఉధృతంగా ప్రచారం సాగింది. కాంగ్రెస్ నుంచి మంత్రులు తమ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. బిజెపి, బిఆర్ఎస్ నేతలు కూడా ప్రచారంలో దూసుకుపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు , 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. అధికార , ప్రతిపక్ష పార్టీలు తమ సత్తా నిరూపించుకునేందుకు ఈ ఎన్నికలను సెమీ ఫైనల్స్‌గా భావిస్తున్నాయి. అగ్రనేతల పర్యటనలు, రోడ్ షోలు, ఇంటింటి ప్రచారంతో ఇన్నాళ్లూ -మిగతా 3 లో

## సుప్రీం కోర్టులో రాజ్ కసిరెడ్డికి షాక్

### రాజ్ కసిరెడ్డికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరణ



- కుంభకోణంలో మీ పాత్ర స్పష్టంగా కనిపిస్తోంది
- మీదే కీలకపాత్ర అని దర్యాప్తు నివేదికలో ఉంది
- మీ నియంత్రణలోనే నిధులు మళ్లించిన షెల్ సంస్థ
- మీరు ప్రధాన కుట్రదారు.. ఇతరులతో పోల్చలేం
- మిగిలిన వారికి బెయిల్ ఇచ్చామని మీకు ఇవ్వలేం
- మద్యం కుంభకోణం కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు
- తదుపరి విచారణ ఎల్లుండికి వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.

మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజ్ కసిరెడ్డికి(ఏ1) సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం విముఖత వ్యక్తం చేసింది. మద్యం కుంభకోణం కేసులో సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డికి బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే. దాన్ని సవాలు చేస్తూ కసిరెడ్డి వేసిన పిటిషన్ సోమవారం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్.వీ.అంజరియాలతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. -మిగతా 3 లో



## స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం..

- నోటీసు ఇచ్చేందుకు విపక్షాలు ప్లాన్
- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే నివాసంలో జరిగిన విపక్ష సభ్యుల భేటీలో ఈ నిర్ణయం
- లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రసంగించేందుకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదని ఆరోపణ

న్యూఢిల్లీ:-
లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు విపక్షాలు ప్లాన్ చేస్తున్నాయి. దీని కోసం నోటీసు ఇవ్వనున్నట్లు విపక్ష పార్టీలు పేర్కొన్నాయి. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే నివాసంలో జరిగిన విపక్ష సభ్యుల భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. లెఫ్ట్ ఫ్రంట్ ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్ ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేశారు. లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రసంగించేందుకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు. మహిళా విపక్ష ఎంపీలపై కూడా స్పీకర్ అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి, వారిని సస్పెండ్ చేసినట్లు ప్రేమ్‌చంద్రన్ ఆరోపించారు. ఈ అంశంలో తాము కట్టుబడి ఉన్నామన్నారు. ఈ నేపథ్యంలో తాము అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లు ఆ ఎంపీ వెల్లడించారు.సభను తమ తొత్తుగా భావిస్తూ నడిపిస్తున్నారని, ఇది ఆమోదయోగ్యం కాదు అని కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ తెలిపారు. వారం రోజుల క్రితం లోక్‌సభలో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ.. గాల్వాన్ ఘర్షణ గురించి మాజీ ఆర్మీ చీఫ్ నరవాణే రాసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన విషయం తెలిసిందే. దీంతో సభలో అప్పటి నుంచి గందరగోళం కొనసాగుతూనే ఉన్నది. అయితే ప్రచురణ కాని పుస్తకం -మిగతా 3 లో

## రాజకీయాలు కాదు.. అభివృద్ధి ముఖ్యం

- మధిరను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతా
- ఎన్నికల ప్రచార సభలో డిప్యూటి సిఎం భట్టి



ఖమ్మం, ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.

మధిర పట్టణ రూపురేఖలను పూర్తిగా మార్చే బాధ్యత తనదేనని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మధిరలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్ తరహాలో మోడరన్ మహాప్రస్థానం శ్మశానవాటిక నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నా మని తెలిపారు. మధిరకు కావాల్సింది రాజకీయాలు కాదని, కేవలం అభివృద్ధి మాత్రమేనని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. ఖమ్మం జిల్లాలోని మధిర మున్సిపాలిటీలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భట్టి విక్రమార్క భారీ రోడ్ షోలో పాల్గొన్నారు. -మిగతా 3 లో

# అట్టుడుకుతున్న మణిపూర్...

**రెండు వర్గాల మధ్య ఘర్షణ**
**పదుల ఇండ్లకు నిప్పు**
**పక్క జిల్లాకు ప్రజల పరారీ**
**బీజేపీ సర్కార్ ఏర్పడిన కొద్ది రోజులకే హింస**




**న్యూఢిల్లీ ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే అక్కడ మళ్లీ హింస చెలరేగింది. ఉఖ్రుల్ జిల్లాలో సోమవారం టాంగ్ఖుల్ నాగా, కుకీ వర్గాలు పరస్పరం దాడులకు తెగబడ్డాయి. సాయుధులైన దుండగులు లిటాన్ గ్రామంలో 20కిపైగా ఇండ్లకు నిప్పు పెట్టారని అధికారులు తెలిపారు. దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు భద్రతా బలగాలు గాల్లోకి కాల్పులు జరిపినట్టు పేర్కొన్నారు.లిటాన్, టాంగ్ఖుల్ గ్రామానికి చెందిన ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు ఇండ్లను వదిలి, పక్క జిల్లా కాంగ్‌పోక్పీకి పారిపోయారని తెలిసింది. లిటాన్ గ్రామంలో శనివారం రాత్రి నాగా వర్గానికి చెందిన ఓ వ్యక్తిపై సామూహిక దాడి ఘటన.. తాజా హింసకు దారితీసిందని అధికారులు చెబుతున్నారు.

# గూండారాజ్యాన్ని మేం ఆమోదించం: సీజేఐ



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
గూండారాజ్యం ఆమోదయోగ్యం కాదు అని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఢిల్లీలోని తీస్ హజారీ కోర్టులో ఓ న్యాయవాదిపై జరిగిన దాడి కేసులో సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆ న్యాయవాది దాఖలు చేసిన అత్యవసర పిటీషన్ పై సుప్రీంకోర్టు స్పందిస్తూ.. ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్‌ను ఆశ్రయించాలని కోరింది. ఫిబ్రవరి 7వ తేదీన తీస్ హజారీ కోర్టులో నిందితుడి తరపున వాదిస్తున్న లాయర్‌పై మరో వర్గానికి చెందిన లాయర్, అతని మనుషులు కోర్టులోనే దాడి చేశారు. జడ్జీ ముందునేగా ఆ అటాక్ జరిగింది. కోర్టులో అందరు ఉన్నప్పుడే ఈ ఘటన జరిగినట్లు ఆ న్యాయవాది తన పిటీషన్‌లో పేర్కొన్నారు.చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్‌పై స్పందిస్తూ.. జనవరి 7వ తేదీన జరిగిన ఘటన గురించి ఢిల్లీ హైకోర్టు సీజేకు ఇన్ఫార్మ్ చేశారా అని సుప్రీం ప్రశ్నించింది. ఢిల్లీ హైకోర్టు సీజేకు లేఖ రాసి, ఆ లేఖను తనకు కూడా పంపమని సుప్రీం సీజే అన్నారు. తొలుత హైకోర్టు చీఫ్ జస్టిస్ దీనిపై స్పందించాలన్నారు. అయితే పరిపాలనా విభాగం చర్యలు తీసుకుంటుదని సుప్రీం ధర్మాసనం వెల్లడించింది. ఇలాంటి గుండారాజ్యం తమకు ఆమోదయోగ్యం కాదు అని, అంటే ఇక్కడ చట్టం విఫలమైనట్లే అని పేర్కొన్నది. తమ పరిధిలో ఉన్న హైకోర్టుకు వెళ్లాలని కోర్టు చెప్పింది.

# మనిషి కన్నా వేగంగా పరుగెత్తే రోబో!




**బీజింగ్ : ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
మానవుల కన్నా వేగంగా పరుగెత్తే 'రోబో'ను చైనా శాస్త్రవేత్తలు తయారుచేశారు. వేగానికి మారుపేరైన రన్నర్ ఉసేన్ బోల్ట్ పేరును ఈ రోబోకు పెట్టారు. షాంఘైకి చెందిన రోబోటిక్స్ కంపెనీ 'మిర్రర్‌మి టెక్నాలజీ' దీన్ని తయారుచేసింది. దీని ఎత్తు 5.7 అడుగులు, బరువు 75 కిలోలు. హ్యూమనాయిడ్ తరహాలో.. మానవులను పోలిన కదలికలు కలిగి ఉండటం దీని ప్రత్యేకత.అయితే ఈ రోబో సెకన్‌కు 10 మీటర్ల వేగంతో మొత్తం 10 సెకన్లలో 100 మీటర్ల దూరం పరుగెత్తుతుందట! ఇదే దూరాన్ని 9.58 సెకన్లలో పూర్తిచేసి బోల్డ్ ఒలింపిక్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఆయనతో పోల్చితే రోబో స్వల్పంగా వెనుకబడింది. ఈ రోబో డెవలపర్స్ దీని అరంగేట్రం గురించి మాట్లాడుతూ మానవ రూపంలోని రోబోల ఉత్తమ పనితీరులో ఇదొక కీలక మైలురాయి అని తెలిపారు.

# ఆ బుక్ భయం వల్లే ప్రధాని సభకు రావడం లేదు

**న్యూఢిల్లీ: ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
మాజీ ఆర్మీ చీఫ్ నరవాణే రాసిన పుస్తకం అంశంలో భయపడడం వల్లే ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభకు రావడం లేదని రాహుల్ గాంధీ( అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై ప్రధాని మోదీ ప్రసంగం లేకుండానే ఆ తీర్మారాన్ని సభ ఆమోదించిన విషయం తెలిసిందే. ఎంపీల వల్ల ప్రధాని ప్రాణాలకు ముప్పు ఉన్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని, ఎవరైనా మోదిని బెదిరిస్తే వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని రాహుల్ గాంధీ అన్నారు. గడిచిన గురువారం కొందరు మహిళా ఎంపీలు లోక్‌సభలో ఆందోళన చేపట్టడం వల్ల ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని రద్దు చేసుకున్న విషయం తెలిసిందే.అమెరికా వాణిజ్య ఒప్పందం అంశంలో భయపడుతున్న ప్రభుత్వం.. బడ్జెట్‌లో చర్చ చేపట్టేందుకు వణుకుతోందని



రాహుల్ విమర్శించారు. ఆ వాణిజ్య ఒప్పందం కుదిరిన తీరు, దాని వల్ల రైతులకు ఎదురుకానున్న సమస్యలను చెప్పేందుకు ప్రభుత్వం జంకుతోందన్నారు. ప్రధాని మోదీని బెదిరించేందుకు సభ్యులు ప్లాన్ చేశారన్న ఊహాగానాలు చాలా డిస్టర్బింగ్‌గా ఉన్నాయని, అలాంటి అంశం ఏమీ లేదని, సభ్యుల వల్ల కాదు.. తాను చెప్పబోయే నిజాన్ని తట్టుకోలేక, భయంతో ప్రధాని సభకు రావడం లేదని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ సభ్యులు ప్రధానిని అటాక్ చేసే ప్రశ్నే లేదని, ఆయన ధైర్యంగా సభకు రావాలని, ఎవరైనా దాడి చేస్తారన్న సమాచారం ఉంటే, ఆ వ్యక్తిని అరెస్టు చేయాలని, మీరెందుకు అలా చేయడం లేదని రాహుల్ గాంధీ అన్నారు. మాజీ ఆర్మీ చీఫ్ నరవాణే రాసిన పుస్తకం పట్ల మోదీకి భయం ఉన్నట్లు తెలిపారు. నరవాణే పుస్తకాన్ని పబ్లిష్ చేయలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అన్నారని, కానీ తమ వద్ద ఆ బుక్ కాపీ ఉన్నట్లు రాహుల్ గాంధీ వెల్లడించారు.

# ఉదయం 8 వరకు కోడి కూత వినపడొద్దు!



**లండన్,- ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
తెల్లవారుజామున 4.30 గంటలకు వస్తున్న కోడి కూత.. పక్కింటి వాళ్లను చాలా ఇబ్బందిపెట్టింది. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేయటంతో సదరు కోడిపుంజును పెంచుకుంటున్న యజమానికి నోటీసులు అందాయి. ఉదయం 8 గంటల వరకు కోడి కూత వినిపించడానికి వీల్లేదు.. అనేది నోటీసు సారాంశం. ఇంగ్లండ్ కౌంటీ 'నార్‌ఫోక్'లోని గ్రామీణ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది.దీనిపై గ్రామంలోని 600 మందికిపైగా ప్రజలు సదరు కోడిపుంజుకు మద్దతుగా నిలబడేందుకు ముందుకు వచ్చారు. పొద్దునే వినిపించే ఆ కోడి కూతే తమ గ్రామానికి గుర్తింపుగా వారంతా పేర్కొన్నారు. నోటీస్‌పై కోడి పుంజు యజమాని స్పందిస్తూ కౌన్సిల్ నోటీస్ తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. మెరుగైన రోడ్లు, చెత్త సేకరణపై కౌన్సిల్ దృష్టిపెడితే బాగుంటుందని హితవు పలికారు.

## గోవాలో సమ్మతి లేకుండా
# ఫొటోలు తీస్తే అరెస్టే!




**పనాజీ ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
తమ రాష్ట్రానికి వచ్చే పర్యాటకుల సమ్మతి లేకుండా వారితో ఫొటోలు లేదా సెల్ఫీలు తీసుకొనే వారిని అరెస్ట్ చేస్తామని లేదా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గోవా పోలీసులు కఠినమైన కొత్త మార్గదర్శకాల్ని జారీ చేశారు. పర్యాటకులు వేధింపులకు గురి కాకుండా ఉండటానికి, వారి గోప్యతను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.పర్యాటకుల అనుమతి లేకుండా అపరిచితులు, ఇన్‌ఫ్లూయెన్సర్లు, ఫొటోగ్రాఫర్లు వారి ఫొటోలు తీయకూడదని తెలిపారు. వారి సమ్మతి లేనిదే వాటిని సామాజిక మాధ్యమాల్లోనూ పోస్ట్ చేయకూడదని స్పష్టం చేశారు. ఫొటోలు తీసుకొనేందుకు అనుమతి ఇవ్వాలని పర్యాటకులపై ఒత్తిడి తీసుకురాకూడదు. అయితే పబ్లిక్ ప్రదేశాలు, సముద్ర తీరాలు, ప్రకృతి దృశ్యాలను ఫొటోలు తీసుకోవచ్చు. అయితే అందులోనూ వ్యక్తిగతంగా ఎవరినీ లక్ష్యంగా చేసి ఫొటోగ్రఫీ తీయకూడదు.

# యూఎస్‌తో ట్రేడ్ డీల్ ఎఫెక్ట్..

## ఆసియాలో మెరుగైన స్థితికి భారత్

**న్యూఢిల్లీ : ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
అగ్రరాజ్యం అమెరికా తో ట్రేడ్ డీల్ తర్వాత ఆసియాలో భారత్ మెరుగైన స్థితికి చేరుకుందని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ అయిన జేఎం ఫైనాన్షియల్ నివేదిక వెల్లడించింది. ఈ ఒప్పందం భారత మార్కెట్లకు సానుకూలాంశమని నివేదిక పేర్కొన్నది. భారత కరెన్సీ బలపడటానికి ఇది దోహదం చేస్తుందని తెలిపింది. భారత్-




అమెరికా దేశాల మధ్య ఇటీవల మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఖరారైంది. ఈ డీల్ నేపథ్యంలో రష్యా నుంచి చమురు దిగుమతులు తగ్గించుకోనందుకు ప్రతీకారంగా వేసిన 25 శాతం అదనపు సుంకాలను అమెరికా ఎత్తివేసింది. ఫలితంగా భారత ఉత్పత్తులపై ఉన్న 50 శాతం సుంకాలు 18 శాతానికి తగ్గాయి. పాకిస్థాన్, చైనా, శ్రీలంక, బంగ్లాదేశ్ లాంటి పలు ఆసియా దేశాలపై అగ్రరాజ్యం అమలుచేస్తోన్న సుంకాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ కావడం గమనార్హం.

# ఇదేనా మీ వృత్తి నైపుణ్యం..

## డిజిటల్ మోసాలపై బ్యాంకులకు సుప్రీం చీవాట్లు

**న్యూఢిల్లీ :ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
డిజిటల్ అరెస్టు మోసం కేసులను పరిష్కరించడంలో బ్యాంకుల వృత్తి నైపుణ్యంపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర ఆగ్రహం ప్రకటించింది. కస్టమర్లు తమ జీవితకాల పొదుపు మొత్తాలను కోల్పోతున్నప్పటికీ అనుమానాస్పద లావాదేవీలను వెంటనే ఎందుకు అడ్డుకోవడం లేదని బ్యాంకులను సుప్రీంకోర్టు నిలదీసింది. అటువంటి మోసాలను ఎదుర్కొనడానికి తీసుకుంటున్న చర్యలపై కేంద్ర హోం శాఖ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ




శాఖ(మీటీ) దాఖలు చేసిన స్థాయీ నివేదికలను కేంద్రం సమర్పించిన సందర్భంగా ఈ అంశాన్ని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం చేపట్టింది. కేసులకు సంబంధించిన డాటాను క్రోడీకరించి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్(ఎస్ఓపీ)ని సిద్ధం చేస్తున్నామని అటార్నీ జనరల్ కోర్టుకు తెలిపారు. కస్టమర్లను రక్షించాల్సిన బాధ్యత బ్యాంకులకు ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈ ఏడాది జనవరి 2న రూపొందించిన ఎస్ఓపీని అధికారికంగా స్వీకరించి అమలు చేయాలని, చోరీ అయిన నిధులను పునరుద్ధరించడానికి ఇంటర్-ఏజెన్సీ సహకారాన్ని బలోపేతం చేయడానికి ప్రొసీజర్లను నిర్ధారించాలని హోం శాఖని ఆదేశించింది.

# నీటి ఎద్దడి రావొద్దు

మొదటి తరువాయి

పీ-4 రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తగ్గించే ప్రత్యేక కార్యక్రమమన్నారు. మార్గదర్శులు, బంగారు మిత్రలను నియమించుకోవాలన్నారు. గత పాలకులు చేసిన అప్పుల కారణంగా 14 శాతం వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. ఏపీ క్రెడిట్ రేటింగ్ పెంచుకుని వడ్డీ తగ్గించుకునేలా రుణాల రీషెడ్యూల్ చేస్తున్నామని చెప్పారు. జీతాల చెల్లింపులను గాడిలో పెట్టామన్నారు. అల్లూరి జిల్లా లంబసింగిలో కుంకుమపువ్వు ఉత్పత్తికి అవకాశాలు కనిపిస్తున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు కశ్మీర్‌లో మాత్రమే కుంకుమపువ్వు ఉత్పత్తి జరుగుతోందన్నారు. అలాగే దేశంలో ఎక్కడా లేని విధంగా ఏలూరు సమీపంలో కోకో సిటీ కూడా ఏర్పాటవుతోందన్నారు. కాఫీ సాగు పెంచడంతో పాటు అరకు కాఫీ బ్రాండ్ ప్రమోట్ చేస్తున్నామన్నారు.



**నీటి నిల్వలు పెరగాలి**

'రాష్ట్రంలో 38,608 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల వద్ద నీటి నిల్వలకు అనుగుణంగా ప్రణాళికలు చేయాలి. చెరువులు, కాల్వలు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలి. డీసిల్టింగ్, అటవీ ప్రాంతాల్లో ట్రెంచ్‌లను తవ్వాలి. భూగర్భ నీటి నిల్వలు పెరిగితే పర్యావరణపరంగా మంచిది. విద్యుత్ కూడా ఆదా అవుతుంది. నీటి బ్యాంకు తరహాలో భూగర్భజలాలు వినియోగం జరగాలి. పారిశ్రామిక కాలుష్యం ద్వారా భూగర్భ జలాలు కలుషితం కాకుండా చూడాలి. సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందాలి. బోర్ల నుంచి కలుషిత నీరు రావడానికి వీల్లేకుండా చూడాలి. ఆశ్రమ బాలుర హాస్టళ్లలో కలుషిత నీరు కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైన పరిస్థితి ఎదురైంది. ఈ తరహా ఘటనలు రాష్ట్రంలో ఉత్పన్నం కాకూడదు. ఇలాంటి సంఘటనలు జరిగితే దానికి సంబంధిత జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జ్ మంత్రులదే బాధ్యత. త్వరలో వేసవి రాబోతోంది. నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటి నుంచే వేసవి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. తాగునీటికి ఇబ్బంది రాకుండా చూసుకోవడంతో పాటు పశువుల దాణాకూ ఇబ్బంది రాకూడదు. పంచాయతీరాజ్ రోడ్లు, నీటిసంరక్షణ చర్యలు, గోకుల షెడ్లు, మ్యాజిక్ డ్రెయిన్లు చేపట్టాలి. జీ రామ్‌జీ పనులపై కార్యాచరణ సిద్ధం చేయండి" అని సీఎం ఆదేశించారు.

**హెల్త్ స్క్రీనింగ్**

"సంజీవని ద్వారా జూలై నాటికి 66 లక్షల హైరిస్క్ కేసుల హెల్త్ స్క్రీనింగ్ చేయాలి. 5 లక్షల మంది హాస్టల్ విద్యార్థులకు స్క్రీనింగ్ చేయాలి. 12వ తరగతి వరకు ఉన్న 70 లక్షల మంది విద్యార్థుల హెల్త్ ప్రొఫైల్స్ కూడా తయారు చేయాలి. కేర్ అండ్ గ్రో ద్వారా మాతా శిశు ఆరోగ్యం, పెరుగుదలను నమోదు చేయాలి. పౌష్టికాహారంతో పాటు అవసరమైన సప్లిమెంట్స్ అందించేలా చర్యలు తీసుకోవాలి. అవిశ, మునగ, రకరకాల ఆకుకూరల్లో పౌష్టికాహారం లభిస్తుంది. మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీలలో పౌష్టికాహారాన్ని అందించేలా కార్యాచరణ ఉండాలి. వీలుంటే అన్న క్యాంటీన్లలో కూడా పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలి. ఇక నార్మల్ డెలివరీలు పెరిగేలా చూడాలి. సిజేరియన్ ఆపరేషన్లు తగ్గాలి. వచ్చే ఏడాది ఎయిడ్స్ ఫ్రీ ఏపీగా డిక్లేర్ చేస్తాం. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా జూన్ నాటికి సమగ్రమైన ఓ కార్డు జారీ చేస్తాం. మార్చి నాటికి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి" అని చంద్రబాబు చెప్పారు.

**ఒత్తిడి లేని విద్యాబోధన లక్ష్యం**

"పదోతరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా వంద రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. పరీక్షలు అంటే.. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండేలా ఈ కార్యాచరణలో భాగం చేయాలి. ఒత్తిడి కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడానికి వీల్లేదు. ఒత్తిడి లేని విద్యా విధానంతోనే కొత్త ఆలోచనలొస్తాయి. ఇన్నోవేషన్లకు ఆస్కారముంటుంది. విద్యా వ్యవస్థలో స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించేందుకు అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. వయోజన విద్యలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా డ్వాక్రా మహిళల సహకారం తీసుకోవాలి. లేటరల్ ఎంట్రీ ఉండేలా యూనివర్సిటీలు, విద్యాసంస్థల్లో చర్యలు చేపట్టాలి. ఎలక్ట్రీషియన్, కార్పెంటర్ వంటి వారు ఉన్నత విద్యను అభ్యసించి సర్టిఫికెట్లు పొందేలా కార్యాచరణ ఉండాలి. కేంద్రం అమలు చేస్తున్న కర్మయోగి పథకంలో ఏపీకి చెందిన వారే అగ్రస్థానంలో ఉన్నారు. నైపుణ్య కల్పనలో భాగంగా ఐటీఐలు, కళాశాలల్లో కాన్వకేషన్లు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలి. నైపుణ్యం పోర్టల్ ద్వారా స్కిల్లింగ్‌తో పాటు ఉద్యోగాలు ఏ మేరకు వస్తున్నాయనే అంశాన్ని పర్యవేక్షించాలి. నైపుణ్యాభివృద్ధి రంగాన్ని మరింత బలోపేతం చేయాలి" అని చంద్రబాబు సూచించారు.

# ముగిసిన మున్సిపల్ ఎన్నికల ప్రచారపర్వం

మొదటి తరువాయి

మార్మోగిన వీధులన్నీ ఇప్పుడు నిశ్శబ్దంగా మారాయి. ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్‌లో ఓటర్లు ఎవరికి పట్టం కడతారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ ఎన్నికల్లో ఓటర్ల బలం గణనీయంగా ఉంది. మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 2,996 వార్డులు, డివిజన్లకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించు కోవడానికి మొత్తం 52,43,023 మంది ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఇందులో పురుష ఓటర్ల సంఖ్య 25,62,639 కాగా, 26,80,014 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం ఈ ఎన్నికల్లో కీలక పరిణామంగా కనిపిస్తోంది. వీరితో పాటు మరో 640 మంది ఇతర ఓటర్లు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం పటిష్టమైన ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,195 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికల కోసం 16,031 బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేశారు. పోలింగ్ పక్రియను పర్యవేక్షించేందుకు 1,379 మంది రిటర్నింగ్ ఆఫీసర్లు (ఖీక్ష), 1,547 మంది సహాయ రిటర్నింగ్ ఆఫీసర్లను నియమించారు. క్షేత్రస్థాయిలో 9,560 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు (ఖక్ష), 31,428 మంది ఇతర సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరచడానికి 137 స్టాంరగ్ రూమ్‌లు, ఫలితాల లెక్కింపు కోసం 136 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు.ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వం భారీ భద్రతను ఏర్పాటు చేసింది. సుమారు 25,000 మంది పోలీసు సిబ్బందితో రాష్ట్రవ్యాప్తంగా నిఘా పెంచారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించారు. ఎన్నికల పక్రియలో పూర్తి పారదర్శకతను పాటించేందుకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్ సదుపాయాన్ని కల్పించారు. దీని ద్వారా ఎన్నికల సంఘం అధికారులు నేరుగా పోలింగ్ సరళిని పర్యవేక్షించవచ్చు. మొత్తం 12,993 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ఈ ఎన్నికల్లో గెలుపు ఎవరిని వరిస్తుందో చూడాలి. ఫిబ్రవరి 11న పోలింగ్ ముగిసిన తర్వాత, ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఆ తర్వాత ఫిబ్రవరి 14న మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్లతో పాటు మున్సిపల్ చైర్మన్ డిప్యూటీ చైర్మన్ల ఎన్నిక పక్రియ జరుగుతుంది. చివరగా ఫిబ్రవరి 16న కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం, ప్రత్యేక సమావేశంతో ఈ ఎన్నికల పక్రియ పూర్తి కానుంది.

# సుప్రీం కోర్టులో రాజ్ కసిరెడ్డికి షాక్

మొదటి తరువాయి

కసిరెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నాగముత్తు వాదనలు వినిపిస్తూ.. కసిరెడ్డి 10 నెలలుగా జైలులోనే ఉన్నారని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇదే కేసులో ఏ6, ఏ34 తదితరులకు ఇప్పటికే బెయిల్ లభించిందన్నారు. ఒక వ్యక్తిని నేరం రుజువు కాకుండానే 10 నెలలపాటు జైలులోనే ఉంచడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. ఏ7కు బంధువు అనే ఒక్క కారణంతో బెయిల్ నిరాకరించడం సరికాదన్నారు. స్పందించిన ధర్మాసనం..'వారికి బెయిల్ లభించిందని మీకు ఇవ్వలేం. కావాలంటే వారికిచ్చిన బెయిల్ రద్దు చేయమని మీరు కోరవచ్చు, కానీ మీ కేసు భిన్నమైనది' అని స్పష్టం చేసింది.

**రూ.732 కోట్లు చిన్న మొత్తమా?.**

. నాగముత్తు వాదనలపై ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. రూ.732 కోట్లు చిన్న మొత్తమా? అని ప్రశ్నించింది. '10 నెలలే కదా జైలులో ఉన్నది. రూ.732 కోట్ల కుంభకోణంలో 10 నెలలు జైలులో ఉంటే సరిపోతుందని మీరు భావిస్తున్నారా?. మద్యం కుంభకోణం జరిగిందని చెబుతున్న సమయంలో మీరు అధికారంలో ఉన్న వ్యక్తి. మీపై వచ్చిన ఆరోపణలకు, మీరు చాలా కాలంపాటు నిర్వహించిన పదవికి ప్రత్యక్ష సంబంధం ఉంది. మీరు సామాన్యమైన వ్యక్తి కాదు. మీరు భారీ మొత్తంలో లంచాలు తీసుకున్నట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని దర్యాప్తులో తేలింది. ఆ డబ్బు మీ ఖాతాల్లో లేదా తెలిసిన వనరుల్లో కనిపించకపోవచ్చు, కానీ, కుంభకోణంలో మీ పాత్ర స్పష్టంగా ఉంది. ఈ వ్యవహారంలో మీరు ప్రధాన కుట్రదారుగా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మిమ్మల్ని ఇతర నిందితులతో పోల్చలేం. నిధులు మళ్లించినట్లుగా చెబుతున్న షెల్ కంపెనీ మీ ప్రత్యక్ష నియంత్రణలోనే ఉంది. కాబట్టి మీరు ఇతర నిందితుల కంటే భిన్నమైన స్థితిలో ఉన్నారు. మద్యం పాలసీని ప్రభావితం చేయడంలోనూ, కొన్ని బ్రాండ్లకు లబ్ధి చేకూర్చడంలోనూ మీ ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోంది' అని పేర్కొంది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, సిద్ధార్థ్ అగర్వాల్ వాదిస్తూ.. నిందితుడు అత్యంత ప్రభావవంతమైన వ్యక్తి అని, బయటకు వస్తే సాక్ష్యాలను తారుమారు చేసే ప్రమాదం ఉందని చెప్పారు. దీంతో.. వేరే నిందితులతో సమానంగా రాజ్ కసిరెడ్డిని చూడలేమని, కావున బెయిల్ పిటిషన్ డిస్మిస్ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. హైకోర్టులో తమ వాదనలు సరిగా వినలేదని, సుప్రీంకోర్టులో తమ వాదనలు పూర్తిగా వినాలని నాగముత్తు అభ్యర్థించగా.. ఆ వాదనలను ఇప్పుడే వినిపించాలని సీజేఐ అన్నారు. శుక్రవారానికి వాయిదా వేయాలని, ఆ రోజు సమగ్రంగా వాదనలు వినిపిస్తామని నాగముత్తు తెలిపారు. దీంతో అన్ని వాస్తవాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే హైకోర్టు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసి ఉండవచ్చని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమకు సమగ్ర వాదనలు వినిపించేందుకు అవకాశం కల్పించాలని నాగముత్తు మరోసారి అభ్యర్థించగా, పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

# రాజకీయాలు కాదు.. అభివృద్ధి ముఖ్యం

మొదటి తరువాయి

ఈ సందర్భంగా ఆయన మధిర పట్టణ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత 10 సంవత్సరాలుగా మధిర మున్సిపాలిటీలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో మధిర మున్సిపాలిటీలోని అన్ని వార్డులను కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అభ్యర్థుల గెలుపు రాజకీయాల కోసం కాదని.. అభివృద్ధి కోసమే అని చెప్పారు. అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్-టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. డబ్బు ప్రధానం కాదని.. అభివృద్ధే ప్రధానమని, వ్యక్తులకన్నా వ్యవస్థలే ముఖ్యమని డిప్యూటీ సీఎం వివరించారు. మధిర మున్సిపాలిటీని రాష్ట్రానికి మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. ఏ అవసరం ఉన్నా ప్రజలందరికీ అండగా నిలుస్తానని చెప్పారు. విజ్ఞులైన ప్రతి ఒక్కరూ మధిర అభివృద్ధిపై తమ ఆలోచనలు పంచుకోవాలని కోరారు. మహిళలను వడ్డీలేని రుణాలతో స్వయం ఉపాధి వ్యాపారస్తులుగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.



# జీవితంలో ఏదీ సులువుగా ఉండదు..

మొదటి తరువాయి

మారుస్తుందని చెప్పారు. ఏఐతో ఉద్యోగాలు పోతాయన్న భయాలు నిజమేనా..? అన్న ప్రశ్నకు సాంకేతికత మన పనితీరును మెరుగుపరుస్తుందని చెప్పారు. దాన్ని సరిగ్గా వినియోగించుకుంటే ఏఐకి విద్యార్థులు భయపడాల్సిన పనిలేదన్నారు. టెక్నాలజీతో ఎలా పనిచేయాలన్నది నేర్చుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. జీవితంలో ఏదీ సులువుగా ఉండదన్నారు.విద్యార్థులకు ఐదు ట్రావెల్ డెస్టినేషన్స్ చెప్పండి..? అని అడుగగా.. ముందు మన సొంత ప్రాంతాలపై దృష్టిపెట్టాలని చెప్పారు. మన జిల్లా, నగరం, రాష్ట్రంలో ఉన్న ముఖ్యమైన ప్రాంతాల జాబితాను రాసుకోవాలన్నారు. ఆ తర్వాత ఎక్కడికి వెళ్లాలో ఎంచుకోవాలని చెప్పారు. అనంతరం మన సమీపంలో ఉన్న ప్రాంతాల విశిష్టతను తెలుసుకుంటే, అది భవిష్యత్తులో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.మంచి నాయకుడిగా ఎలా మారాలి..? అన్న ప్రశ్నకు మన విధివిధానాలకు ఎన్నటికీ భయపడకూడదని చెప్పారు. విధేయత, నిబద్ధతతో పనిచేయాలన్నారు. నిలకడగా సరైన పని చేయడమే నిజమైన నాయకత్వమని చెప్పారు. లీడర్‌షిప్‌నకు ముఖ్యమైన లక్షణం మీ ఆలోచనలను కనీసం 10 మందికైనా స్పష్టంగా తెలియజేయగలడమని అన్నారు.మెదడు ఆరోగ్యంగా పనిచేయాలంటే కంటినిండా నిద్రపోవాలని ప్రధాని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు జీవితాన్ని కూడా ఆస్వాదించాలని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసంగా ఉండటం చాలా ముఖ్యమని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలమని ప్రధాని తెలిపారు.

# మేం ఎవరికీ భయపడం

మొదటి తరువాయి

అణు కార్యక్రమంపై భవిష్యత్ సంప్రదింపులకు బాటలు వేసేందుకే ఇరు దేశాలు ఈ చర్చల్లో పాల్గొన్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే సమయంలో గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తమ సైనిక మోహరింపును పెంచుతోంది. అణు ప్రణాళికలకు సంబంధించి ఇరాన్‌పై ఒత్తిడి పెంచే ఉద్దేశంతోనే ఈ మోహరింపులు చేపట్టినట్లు తెలుస్తోంది.ఒకవేళ చర్చలు విఫలమైతే దాడులకు దిగుతామని ఈ సైనిక మోహరింపు ద్వారా అగ్రరాజ్యం సంకేతాలిచ్చింది. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యంలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి

# నేడు అమిత్‌షాతో బాబు భేటీ

మొదటి తరువాయి

ఏపీలో చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను టెండూల్కర్ ప్రశంసించినట్లు తెలిసింది. ఆ తర్వాత సీఎం 1-జన్‌పథ్‌లోని తన అధికారిక నివాసానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, మరో నలుగురు కేంద్ర మంత్రులతో వరుస భేటీలు నిర్వహించనున్నారు. తొలుత జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, తర్వాత అమిత్‌షా, అనంతరం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లతో సమావేశమవుతారు. రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులు, వివిధ పథకాలు, కార్యక్రమాలకు నిధుల కేటాయింపుపై చర్చిస్తారు. సాయంత్రం 5 గంటలకు ఆయన అమరావతికి తిరుగుప్రయాణమవుతారు.

# అంబటికి నోటీసులివ్వండి

మొదటి తరువాయి

వ్యాజ్యాలపై తదుపరి విచారణను మార్చి 16కి వాయిదా వేసింది. సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. వెన్నుపోటు దినం పేరుతో అనుమతి లేకుండా బైక్ ర్యాలీ నిర్వహించడంతో పాటు అడ్డుకున్న ఇన్‌స్పెక్టర్‌ను బెదిరించి, దుర్భాషలాడారంటూ ఎస్‌ఐ నక్కా నరహరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత ఏడాది జూన్ 4న గుంటూరు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరులోని బజరంగ్ జూట్ మిల్ భూములకు సంబంధించి యాజమాన్యం, కార్మికుల మధ్య జరుగుతున్న వివాదంపై తాను దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని, లేకుంటే చంపేస్తామని బెదిరించారని, కులం పేరుతో దూషించారని పేర్కొంటూ కార్మిక నాయకుడు పిల్లి బాబూరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2025లో గుంటూరు నగరంపాలెం పోలీసులు అంబటిపై కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను కొట్టివేయాలని కోరుతూ అంబటి రాంబాబు హైకోర్టును ఆశ్రయించారు.

# సర్'కు అడ్డంకులు కల్పించవద్దు..

మొదటి తరువాయి

వివాహం తర్వాత మహిళల చిరునామాలలో మార్పు వంటి చిన్న లోపాలను సాకుగా చూపి ఓట్లు తొలగిస్తున్నారని ధర్మాసనానికి తెలిపింది. సర్ ప్రక్రియవల్ల 1.36 కోట్ల మంది ఓటర్లు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. తమ స్థానికతను నిరూపించుకోవడానికి ఓటర్లకు ఈసీ ఒక్క అవకాశమూ ఇవ్వలేదని బెంగాల్ సర్కార్ న్యాయస్థానానికి తెలియజేసింది. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ రాష్ట్రంలో ఓటర్ల దరఖాస్తులు పూర్తి చేయడానికి, డేటాను ఖరారు చేయడానికి గడువును ఒక వారం పొడిగిస్తున్నట్లు వెల్లడించింది.

# స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం..




నుంచి వ్యాఖ్యలు చేయవద్దు అని రాహుల్ గాంధీని స్పీకర్ కోరారు. వాస్తవానికి లోక్‌సభలో విపక్ష సభ్యుల సంఖ్య నామమాత్రమే. కానీ స్పీకర్‌పై వ్యతిరేకతను వ్యక్తం చేసేందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు విపక్షాలు చెబుతున్నాయి. లోక్‌సభకు రావొద్దు అని శుక్రవారం ప్రధాని మోదీని తానే చెప్పినట్లు స్పీకర్ బిర్లా పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానం ఇంకా లోక్‌సభలో కొనసాగుతున్నది. రాహుల్ గాంధీ మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కూడా విపక్షాలు డిమాండ్ చేశాయి. సోమవారం ఉదయం విపక్షాలు ఆందోళన చేపట్టడంతో సభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు.ఇక 2024 డిసెంబర్‌లో రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్‌కడ్‌పై విపక్షాలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. 14 రోజుల నోటీసు సమయం ఇవ్వకుండా అకస్మాత్తుగా నోటీసు ఇచ్చినందుకు దాన్ని డిప్యూటీ చైర్మెన్ తిరస్కరించారు. ధన్‌కడ్ పేరును కూడా సరిగా ప్రచురించలేదన్నారు.

# సంపాదకీయం

## తిరుమలలో సొంత డెయిరీపై ఆలోచించాలి !



తిరుమల పవిత్రతను కాపాడేందుకు తీసుకునే చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెడితే బాగుంటుంది. ఎందుకంటే దాదపు ఏడాదిన్నరగా తిరుమల లడ్డూ కల్తీ చుట్టూనే రాజకీయాలు నడుస్తున్నాయి. ఈ విషయంలో సిట్ దర్యాప్తు సాగుతోంది. ప్రత్యేక విచారణలు చేపట్టారు. మరో ఏకసభ్య కమిటీ వేస్తున్నట్లు సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇక తిరుమల పవిత్రత దెబ్బతినకుండా, రాజకీయాలకు తావు లేకుండా కఠిన చర్యలకు అసవరమైన నిర్ణయాలు తీసుకోవడంలో దృష్టి పెడితే మంచిది. తిరుమలలో తీసుకునే నిర్ణయాలను ఇప్పుడు ఎవ్వరూ ప్రశ్నించరు. భక్తులకు వసతి పెంచడం, సౌకర్యాలు పెంచడం, శీఘ్రగతిన దర్శనాలు కల్పించడంలో ప్రధాన నిర్ణయాలు జరగాలి. తిరుమలలో సామాన్యులకు సత్వర దర్శనం అన్నది కలగా మారింది. విఐపిల తాకిడి పెరుగుతోంది. స్వామిని దర్శించుకున్న వారే ఇంకా దర్శించుకుంటున్నారు. అలాగే తిరుమలలో ప్లాస్టిక్ నిషేధం జరగాల్సి ఉంది. లడ్డూలను తాటాకు బుట్టల్లో సరఫరా చేస్తామని గతంలో ప్రకటించినా అమల్లోకి రాలేదు. మంచినీటి సమస్యలు రాకుండా చూడాలి. తిరుమలలో సొంత డెయిరీ ఏర్పాటుపై ఆలోచన చేయడం లేదు. ఇకపోతే తెలంగాణ నేతల సిఫార్సులపై వివక్ష ఇంకా కొనసాగుతోంది. ఈ వివక్ష తొలగిపోవాలి. తెలంగాణ నేతలను చిన్నచూపు చూడడం ద్వారా ప్రభుత్వం ఈ ప్రాంతా ప్రజలను అవమానపరుస్తోంది. తిరుమల కొండల్లో పచ్చదనం పెంచాల్సి ఉంది. అడువుల్లో సామాజిక వనాలు పెరగాలి. ఇవన్నీ వదిలేసి ఇంకా కల్తీ నెయ్యి వ్యవహారంతో టిడిపి కూటమి ఒకవైపు, వైకాపా నేతలు మరో వైపు అన్నట్లుగా విమర్శలు, ప్రతివిమర్శలు చేయడం సరికాదు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో సాగుతున్న రాజకీయ ఘటనలు దిగజారుతున్న రాజకీయ విలువలకు పరాకాష్టగా మారాయి. తిరుపతి లడ్డూ కల్తీపై సుప్రీంకోర్టు జోక్యంతో సిబిఐ ఏర్పాటు చేసిన సిట్ నివేదిక బహిరంగ పరచకుండానే అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ స్వంత వ్యాఖ్యానాలతో రాజకీయంగా లబ్ది పొందే చర్యలకు దిగారు. లడ్డూ ప్రసాదంలో కొవ్వు అంటూ అధికార కూటమి చేసిన ప్రచారానికి ప్రాయశ్చితంగా యజ్ఞాలు, యాగాలు, పూజలకు వైసిపి నాయకులు తెరతీసారు. దీనికి పోటీగా లడ్డు కల్తీ చేసిన వైసిపి నేతలంటూ అనేక జిల్లాల్లో పేరు, ఊరు లేని బ్యానర్లు వెలిశాయి. పరస్పర విమర్శలతో మొదలై, హద్దులు దాటిన వ్యక్తిగత విమర్శలకు చేరి, దాడులకు, గృహ దహనాల వరకు ఆ వివాదం విస్తరించింది. తిరుపతి లడ్డు కోట్ల మంది ప్రజల విశ్వాసంతో ముడిపడిన సున్నితమైన అంశం. తమ విశ్వాసానికి తగ్గట్టుగా ప్రసాదం పవిత్రంగా వుండాలని కోరుకుంటారు. అలాంటి లడ్డూలో ఆవు కొవ్వు, ఇతర జంతువుల కొవ్వుల లాంటివి కలిశాయని ముఖ్యమంత్రి చెప్పడంతో తక్షణం నిజానిజాలు తేల్చి దోషులకు శిక్ష వేసివుంటే ఇంత రచ్చ జరిగి ఉండేది కాదు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హిందూ మతానికి అపచారం జరిగిందంటూ కనకదుర్గమ్మ గుడి మెట్లు కడిగారు. ఇలా కాకుండా నిజాలు నిగ్గుతేల్చి దోషులను కోర్టు ముందు నిలబెట్టి ఉంటే బాగుండేది. అన్నింటికి మించి తిరుమల శ్రీవారు కోట్లకు పడగలెత్తారు. ఆయనకు వందలాది గోవులు కూడా ఉన్నాయి. నిజానికి చిత్తశుద్ధి ఉంటే గోశాలలను విస్తరించి, సొంత డెయిరీ ఏర్పాటు చేసివుంటే పేచీ వచ్చేది కాదు. గోశాలలను పెంచి, డెయిరీ ఏర్పాటు చేస్తే నిరుద్యోగ సమస్యా కొంత తీరుతుంది. నెయ్యి కల్తీ సమస్య ఉత్పన్నం కాదు. కల్తీ తీవ్రమైన ఆరోపణ కాబట్టి సంబంధిత అధికార సంస్థల ద్వారా నేరాన్ని నిరూపించి నిందితులకు శిక్షపడేలా చేయడం ప్రభుత్వ బాధ్యత. అందుకోసం నియమించిన సిట్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలి. నివేదికలో ఏముందో ప్రకటించకుండానే మరో కమిటీ వేయడంలో అర్థం లేదు. నిజానికి కల్తీ నెయ్యి వ్యవహారం తిరుమల ప్రతిష్టను దెబ్బ తీసేందుకు జరిగిన కుట్ర అనడంలో సందేహం లేదు. హిందూ మతంపై దాడి అని అనడంలోనూ సందేహం లేదు. గతంలో జరిగిన రామతీర్థం, అంతర్వేది, దుర్గ గుడి విగ్రహాల విధ్వంసం, రథాలు కాలిపోవడం లాంటి విషయాలను ప్రస్తావించి ఇదంతా హిందూ మతాన్ని దెబ్బతీసి నిర్వీర్యం చేసేందుకు జరుగుతున్న కుట్ర అని పవన్ కళ్యాణ్ ఇప్పటికే ఆరోపించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల చర్యలు అంతిమంగా తమ రాజకీయ పబ్బం గడుపుకునేలా తయారయ్యాయి. ఈ సమస్యలనే ఇక ఇంతటితో ముగించాలి. తిరుమల శ్రీవారికి అవసరమైన ఆవునెయ్యిని పొందేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. తిరుమలలో డెయిరీ ఏర్పాటు చేస్తే మరీమంచిది. శాశ్వతంగా సమస్యకు పరిష్కారం దక్కగలదు. వేలకోట్లు వృధా చేసే బదులు శ్రీవారికి అవసరమైన నెయ్యి, పాలు, వెన్న, మీగడలను పొందేందుకు ఇదే సరైన సమయం. డబ్బులకు కొదవ లేదు. గోవులకు కొదవ లేదు. చంద్రబాబు హెరిటేజ్ నడిపిన అనుభవంతో తిరులమ శ్రీవారి కోసం ఓ మంచి డెయినీ ఏర్పాటు చేస్తే మంచిది. సుగంధ ద్రవ్యాలను కూడా కొండపై పండించే అవకాశలను పరిశీలించాలి. పూదోటలను విస్తరించాలి. ఆ దిశగా కూటమి నేతలు ఆలోచనలు చేయాలి. సమర్థులైన అధికారులు, బోర్డు ఛైర్మన్, సభ్యులు, ఉన్నప్పుడే ఇది సాధ్యం అవుతుంది. రాజకీయ తాబేదార్లకు బోర్టును అప్పగించినంతకాలం ఇది ఇది సాధ్యం కాదు. ఇకపోతే తిరుమల కల్తీ వ్యవహారాన్ని కోర్టుల తుది తీర్పుకు వదిలేయాలి. అప్పటి వరకు రాజకీయ విమర్శలకు దిగకపోవడం మంచిది.

# ఇకపై రైళ్లలో సులువుగా ఫుడ్ ఆర్డర్..

### ఇ-ప్యాంట్రీ సేవలు అందుబాటులోకి




**న్యూఢిల్లీ ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
భారతీయ రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రైల్లో ఫుడ్ ఆర్డర్ చేసేందుకు ఐఆర్‌సీటీసీ ఇ-ప్యాంట్రీ సౌకర్యాన్ని ప్రవేశపెట్టింది. తొలుత వివేక్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో ఈ సేవలను ప్రారంభించారు. మొత్తం 25 మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్యాంట్రీ కార్ కలిగిన ఎంపిక చేసిన రైళ్లలో ఈ సేవలు అందుబాటులో ఉంటాయి.కన్ఫామ్ టికెట్, ఆర్‌ఏసీ, పాక్షికంగా టికెట్ కన్ఫామ్ అయిన ప్రయాణికులు ఇ-ప్యాంట్రీ ద్వారా ప్రీ ఆర్డర్ చేసుకోవచ్చు. ప్యాంట్రీ కార్ స్టాఫ్ సీటు దగ్గరకే ఆహారాన్ని డెలివరీ చేస్తారు. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా యాప్‌లో 'బుక్‌డ్ టికెట్ హిస్టరీ' సెక్షన్‌లో ఇ-ప్యాంట్రీ మీల్ ఆప్షన్ కనిపిస్తుంది. మీల్ బుక్ చేసుకున్నాక మీల్ వెరిఫికేషన్ కోడ్ వస్తుంది. దాన్ని డెలివరీ సమయంలో చూపించాలి.విశాఖ నుంచి వెళ్లే ఏపీ ఎక్స్‌ప్రెస్ కూడా ఈ జాబితాలో ఉంది. దశల వారీగా మిగిలిన రైళ్లకూ ఈ సదుపాయాన్ని విస్తరించనున్నారు. ఇ-ప్యాంట్రీ ద్వారా స్టాండర్డ్ లేదా రైల్‌నీర్‌ను బుక్ చేసుకోవచ్చు. ట్రెయిన్ ఎక్కాక ఆహారం కోసం ఆలోచన చేయాల్సిన అవసరం తప్పుతుంది. డిజిటల్ మోడ్‌లో చెల్లింపులు చేయవచ్చు. ఆన్‌లైన్‌లో మీరు ఫుడ్ బుక్ చేసుకోగానే మీకు మీల్ వెరిఫికేషన్ కోడ్ అందుతుంది. మీల్ ఆర్డర్ నుంచి డెలివరీ వరకు ట్రాకింగ్ ఉంటుంది. ఏదైనా కారణంతో ఫుడ్ డెలివరీ అవ్వకపోతే ఆ సమాచారం కూడా ఎస్సెమ్మెస్/ ఇ-మెయిల్ ద్వారా సమాచారం వస్తుంది. ఆన్‌లైన్‌లోనే రిఫండ్ అయిపోతుంది.

## కుల్దీప్ సింగ్ సెంగర్‌కు
# బెయిల్ నిరాకరణ



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్**
ఉన్నావ్ అత్యాచార బాధితురాలి తండ్రి (జ్యుడిషియల్ కస్టడీ డెత్) మృతి కేసులో బహిష్కృత బీజేపీ నేత కుల్దీప్ సింగ్ సెంగర్‌కు బెయిల్ మంజూరు చేయడానికి సోమవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇందులో సెంగర్ నైతిక దుర్వినియోగానికి పాల్పడిన నేరాలు ఉన్నాయని సుప్రీం పేర్కొంది. అలాగే సెంగర్ శిక్షను పెంచాలని ఉన్నావో అత్యాచార బాధితురాలి కుటుంబం అప్పీల్‌ను ప్రాధాన్యతా ప్రాతిపదిక విచారించండని భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఢిల్లీ హైకోర్టును కోరింది. అతని అప్పీలును మూడు నెలల్లోగా నిర్ణయించాలని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. బాధితురాలు కుటుంబం దాఖలు చేసిన శిక్షను పెంచాలని దాఖలు చేసిన అప్పీల్‌ను ఫిబ్రవరి 11న హైకోర్టు ముందు విచారణకు జాబితా చేస్తున్నట్లు సిబిఐ తరపున సొలిసిటర్ జనరల్ తషార్ మెహతా సమర్పించిన తర్వాత సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. కాగా, ఆ కేసులో అప్పీలుదారుడు (బాధితురాలు) హైకోర్టు ముందు ఇదే విషయాన్ని ప్రస్తావించడానికి స్వేచ్ఛను కల్పిస్తున్నాం. ఢిల్లీ హైకోర్టు ఈ అప్పీల్‌ను వారం రోజుల్లోగా విచారణకు స్వీకరించాలి. ఒకవేళ సెంగార్ కూడా అప్పీలు చేసే అవకాశాన్ని హైకోర్టు భావిస్తే.. రెండింటినీ కలిపి విచారించి నిర్ణయం తీసుకోవాలని, దానికి బెంచ్ కూర్పులో మార్పు అవసరమైతే అదే చేయవచ్చు అని జస్టిస్ జోరుమల్య బాగ్జి, జస్టిస్ ఎన్వి అంజరియాతో కూడిన బెంచ్ పేర్కొంది

# ముంబైలో రద్దీ పన్ను?



**ముంబై ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
ముంబైలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, వాయు నాణ్యతను పెంచడానికి రద్దీ పన్ను విధించాలని కొత్తగా ఎన్నికైన బీజేపీ కార్పొరేటర్ మకరంద్ నర్వేకర్ నగర పాలక సంస్థకు ప్రతిపాదించారు. దక్షిణ ముంబైలో రద్దీగా ఉండే నారీమన్ పాయింట్, కొలబా, ఫోర్ట్ వంటి ప్రాంతాల్లో రద్దీ సమయాల్లో ఒంటరిగా వాహనాలు నడిపే ప్రైవేట్ డ్రైవర్లకు ఈ పన్ను విధించాలని ఆయన కోరారు. ఈ పన్నులతో వచ్చే ఆదాయాన్ని నగరంలో వాయు నాణ్యతను మెరుగుపరిచేందుకు ఖర్చు చేయాలని సూచించారు.ఒంటరిగా వాహనాలు నడిపే ప్రైవేట్ డ్రైవర్లకు రూ.50-రూ.100 వరకు రద్దీ పన్ను విధించాలని సూచించారు. ఫాస్టాగ్ విధానం, సీసీటీవీ కెమెరాలు, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ లాంటి సాంకేతికత సాయంతో ఈ పన్ను విధింపును అమలు చేయాలని కోరారు. రద్దీని నియంత్రించడానికి మెరుగైన ప్రజా రవాణా వ్యవస్థను ఏర్పాటు చేయాలని మొబిలిటీ ఫోరం సభ్యుడు ఏవీ షెనాయ్ సూచించారు.

# ఆ నిధులపై లోక్‌సభలో ప్రశ్నలకు నో

-పీఎం-కేర్స్, పీఎం ఎన్ఆర్ఎఫ్, ఎన్‌డీఎఫ్‌లపై పీఎంఓ
-లోక్‌సభ సెక్రెటేరియట్‌కు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడి
-నిబంధనలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవచ్చని స్పష్టీకరణ




**న్యూఢిల్లీ ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
: ప్రధాన మంత్రి సహాయ నిధి (పీఎం-కేర్స్), ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్ ఆర్ఎఫ్), జాతీయ రక్షణ నిధి (ఎన్‌డీఎఫ్)లకు సంబంధించి లోక్‌సభలో ప్రశ్నలు అడగడం అనుమతించదగినది కాదని ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) స్పష్టం చేసింది. ఈ విషయాన్ని లోక్‌సభ సెక్రెటేరియట్‌కు తెలిపింది. ఈ మేరకు కొన్ని నిబంధనలను పేర్కొంది. పీఎంఓ నిర్ణయంపై సర్వత్రా చర్చకు దారితీస్తున్నది. ఇది అందరిలోనూ పలు అనుమానాలు కలిగిస్తున్నది. లోక్‌సభ విధి విధానాలు, నిర్వహణ నియమావళిలోని నిబంధనల ప్రకారం ఈ మూడు నిధులకు సంబంధించిన ప్రశ్నలు ఆమోదయోగ్యం కావని వివరించింది. గతనెల 30న లోక్‌సభ సెక్రెటేరియట్‌కు పీఎంఓ దీనిని తెలియజేసినట్టు ఓ ఆంగ్ల వార్త కథనం పేర్కొన్నది. కేంద్రం పేర్కొన్న నిబంధనల ప్రకారం... భారత ప్రభుత్వ ప్రధాన బాధ్యతకు సంబంధించినవి కాని విషయాలపై ప్రశ్నలు అడగరాదు. అలాగే ప్రభుత్వం ప్రధానంగా బాధ్యత వహించని సంస్థలు లేదా వ్యక్తుల నియంత్రణలో ఉన్న అంశాలపై ప్రశ్నలు అనుమతించ రాదు. ఈ నిబంధనల ఆధారంగా పీఎంకేర్స్, పీఎంఎన్ఆర్ఎఫ్, ఎన్‌డీఎఫ్ నిధులు ప్రభుత్వం నేరుగా నిర్వహించే నిధులు కావనీ, అందువల్ల వీటిపై పార్లమెంటు ప్రశ్నలు అనుమతించలేమని పీఎంఓ వాదించింది. ఈ మూడు నిధుల మూలధనం (కార్పస్) పూర్తిగా ప్రజల స్వచ్ఛంద విరాళాలతోనే ఏర్పడిందనీ, కేంద్ర సమీకృత నిధి నుంచి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని పీఎంఓ.. లోక్‌సభ సెక్రెటేరియట్‌కు వివరించింది. భవిష్యత్తులో ఈ నిధులకు సంబంధించి ప్రశ్నలు, జీరో అవర్ నోటీసులు, ప్రత్యేక ప్రస్తావనలు వచ్చినట్టయితే... ఈ నిబంధనలను అనుసరించి వాటి అనుమతిపై నిర్ణయం తీసుకోవచ్చని కూడా పీఎంఓ సూచించింది. కాగా ఈ అంశంపై సదరు ఆంగ్ల వార్త సంస్థ పీఎంఓకు ఈమెయిల్ పంపింది. దీనిపై ప్రధాన మంత్రి కార్యాలయం స్పందించలేదు. అలాగే లోక్‌సభ సెక్రెటేరియట్‌లోని మీడియా అండ్ పబ్లిక్ రిలేషన్ శాఖ జాయింట్ సెక్రెటరీ ముకేశ్ కుమార్ శర్మ కూడా దీనిపై స్పందించలేదు. ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి అందినట్టుగా తెలుస్తున్న ఈ సమాచారం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ నిధుల విషయంలో గోప్యత పాటించాల్సిన అవసరం ఏమిటనీ పలువురు ప్రశ్నిస్తున్నారు.

# 9 స్కూళ్లకు బాంబు బెదిరింపులు..




**న్యూఢిల్లీ ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
దేశ రాజధానిలో వరుస బాంబు బెదిరింపులు విద్యాసంస్థలను వణికిస్తున్నాయి. తాజాగా సోమవారం ఉదయం ఢిల్లీలోని తొమ్మిది ప్రముఖ పాఠశాలలకు బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో అధికార యంత్రాంగం ఒక్కసారిగా అప్రమత్తమైంది. గత కొంతకాలంగా ప్రధాన నగరాల్లోని పాఠశాలలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వరుస ఘటనల్లో ఇది తాజా పరిణామం. ఉదయం సుమారు 8:30 నుండి 9:00 గంటల మధ్య వివిధ జిల్లాల్లోని పాఠశాలలకు ఈ బెదిరింపులు రావడంతో యాజమాన్యాలు అప్రమత్తమయ్యాయి. వెంటనే పోలీసులకు సమాచారమివ్వగా.. ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగారు. అగ్నిమాపక దళం, బాంబు డిస్పోజల్ స్క్వాడ్‌లను యుద్ధ ప్రాతిపదికన ఆయా పాఠశాలలకు తరలించారు. ముందస్తు జాగ్రత్తగా పాఠశాలల్లోని విద్యార్థులను, సిబ్బందిని వెంటనే బయటకు పంపించి స్కూళ్లను ఖాళీ చేయించారు. ప్రస్తుతం ఆయా పాఠశాలల్లో బాంబు స్క్వాడ్ సభ్యులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ బెదిరింపులు కేవలం పుకార్లేనా లేక దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వరుసగా పాఠశాలలను లక్ష్యంగా చేసుకుని వస్తున్న ఈ కాల్స్‌తో అటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఇటు విద్యాసంస్థల నిర్వాహకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అనారోగ్యంతో ఉన్న సీనియర్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే



**తనకల్లు ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్, తనకల్లు మండలంలోని గందోడి వారి పల్లెకు చెందిన, అనారోగ్యంతో ఉన్న టిడిపి సీనియర్ నాయకుడు చారుపల్లి కృష్ణారెడ్డిని సోమవారం కదిరిలోని వారి నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చారిపల్లి కృష్ణారెడ్డి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అందుతున్న వైద్య చికిత్స వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కృష్ణారెడ్డి త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. పార్టీ కోసం ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కృష్ణారెడ్డికి అవసరమైన మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ బేగం శంకర్ నాయుడు, రాజారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈశ్వర్ రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ




**నంద్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 9(డ్రీమ్ టైమ్స్):**
నంద్యాల పట్టణం 7వ వార్డు పరిధిలోని ఫరూక్ నగర్ శారదా విద్యాపీఠంలో పేద విద్యార్థులకు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ చేతుల మీదుగా నోటు పుస్తకాలను అందజేశారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శారదా విద్యాపీఠం హెడ్ మాస్టర్ కు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ జనవరి ఒకటో తేదీన ఇచ్చిన పిలుపు మేరకు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. 'బొకేలు వద్దు - పుస్తకాలు ముద్దు' అనే నినాదంతో మంత్రి చేసిన సూచనలకు నాయకులు, కార్యకర్తలు విశేషంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. నాయకులు అందజేసిన పెన్నులు, పుస్తకాలు, స్కూల్ బ్యాగులను నిరుపేద విద్యార్థులకు అందజేస్తున్నామని ఫిరోజ్ వివరించారు. ఈ పుస్తకాలు విద్యార్థుల చదువుకు ఎంతో కొంత తోడ్పడతాయని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీ శారదా విద్యా పీఠం ప్రధానాచార్యులు వెంకట కృష్ణయ్య, కౌన్సిలర్ కండె శ్యాంసుందర్ లాల్, తెలుగు దేశం పార్టీ నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్త , 7వ వార్డ్ ఫరూక్ నగర్ ఇంచార్జి సైలాబ్ , మార్కెట్ యార్డ్ డైరెక్టర్ అజ్మీర్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చౌడేశ్వరి దేవస్థానంలో హుండీ లెక్కింపు

రూ 20,90,846/- ఆదాయం



**బనగానపల్లె, ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి దేవతా దేవస్థానంలో హుండీని లెక్కించగా 20,90,846 రూపాయల ఆదాయం వచ్చినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు సోమవారం మండలంలోని నందవరంశ్రీ చౌడేశ్వరి దేవతా దేవస్థానంలో నవంబర్ 12 2025 నుండి 2026 ఫిబ్రవరి 8వ తేదీ వరకు హుండీ కౌంటింగ్ చేయగా 20,90,846/- రూపాయల నగదు, బంగారు వస్తువులు 17 గ్రాములు, వెండి వస్తువులు 560 గ్రాములు వచ్చినట్లు అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ తనిఖీ అధికారి హరిశ్చంద్ర రెడ్డి , ఆలయ చైర్మన్ పి. రామసేతు నాగార్జున రెడ్డి, ఆలయ సిబ్బంది, నందవరం గ్రామీణ బ్యాంక్ క్యాషియర్లు జి. రామ లింగేశ్వరుడు, జి. హుస్సేన్ బాబు ,నంద్యాల బాలాజీ సేవ సమితి సంఘం వారు పాల్గొన్నారు.

# మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

**-నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు 45 రోజుల శిక్షణ**
**-మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి**
**-రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**



**అమరావతి, ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
రాష్ట్రంలో నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ విద్యార్థుల కోసం ఉచిత శిక్షణ ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఉచిత శిక్షణకు సంబంధించిన వివరాలను మంత్రి ఫరూక్ వెల్లడించారు. మైనారిటీ సంక్షేమ శాఖ నేతృత్వంలో, సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సీఈడీఎం) ద్వారా మైనారిటీ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నీట్, ఈఏపీ సెట్ ల పోటీ పరీక్షల్లో ఉన్నతమైన మార్కులను సాధించి, మంచిర్యాంకులతో వైద్య, ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మా తదితర అండర్ గ్రాడ్యుయేషన్ ( యూజీ కోర్సులు) కోర్సుల్లో అడ్మిషన్ పొందేందుకు వీలుగా మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వబోతున్నట్లు తెలిపారు. ఉచిత శిక్షణను ఆన్ లైన్, ఆఫ్ లైన్ విధానాలలో 45 రోజుల పాటు అందించడం జరుగుతుందన్నారు.నీట్, ఈఏపీ సెట్ ల శిక్షణలో నిష్ణాతులైన అధ్యాపకుల చేత బోధనా తరగతులు నిర్వహించడం జరుగుతుందని మంత్రి ఫరూక్ తెలిపారు.ఈ అవకాశాన్ని మైనారిటీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సీఈడీఎం వెబ్ సైట్:: www.apcedmmwd.org లేదా విజయవాడ సీఈడీఎం కేంద్ర కార్యాలయం లో సంప్రదించాలన్నారు.అలాగే cedmap2017@gmail.com, ఫోన్ నెంబర్:0866-2970567, మొబైల్ నెంబర్ :73867 89966 సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చని మైనారిటీ మంత్రి ఫరూక్ తెలిపారు.

# మైనారిటీల సంక్షేమానికి కూటమి"కట్టుబడి ఉంది

**-ఎన్ఎండీ ఫిరోజ్**
**-నంద్యాలలో ఘనంగా హజ్ యాత్రికుల వ్యాక్సినేషన్, మెడికల్ స్క్రీనింగ్ క్యాంప్**




**నంద్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 09 (డ్రీమ్ టైమ్స్)**
హజ్ యాత్ర జీవితంలో ఒక పవిత్రమైన ఘట్టమని, యాత్రికులు అందరూ సౌదీ అరేబియాలో అత్యంత క్రమశిక్షణతో ఆరోగ్యంగా యాత్రను పూర్తి చేయాలని తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ కోరారు. అంతర్జాతీయ ఆరోగ్య నిబంధనల ప్రకారం వ్యాక్సినేషన్ తీసుకోవడం తప్పనిసరని, ఇది యాత్రికుల రక్షణ కోసమేనని చెప్పారు. నంద్యాల పట్టణంలోని నేషనల్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సోమవారం హజ్-2026 యాత్రికుల కోసం ప్రత్యేక వైద్య పరీక్షలు, వ్యాక్సినేషన్ క్యాంప్ నిర్వహించారు. సొసైటీ జిల్లా అధ్యక్షులు, నేషనల్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ఎండి ఫిరోజ్ హాజరై వ్యాక్సినేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ హజ్ కమిటీ చేస్తున్న కృషిని అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని, హజ్ యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విమాన ప్రయాణం నుంచి బస వరకు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పవిత్రమైన మక్కా, మదీనా సందర్శన సమయంలో దేశం సుభిక్షంగా ఉండాలని, నంద్యాల జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రత్యేకంగా ప్రార్థించాలని యాత్రికులను కోరారు. డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ హజ్ యాత్రకు వెళ్లే అల్లాహ్ అతిథులకు సేవ చేయడం తమ విద్యా సంస్థలకు, హజ్ సొసైటీకి దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నామన్నారు. నంద్యాల జిల్లా నుండి వెళ్లే ప్రతి యాత్రికుడికి అప్లికేషన్ ప్రక్రియ నుండి యాత్ర ముగిసి తిరిగి వచ్చే వరకు జిల్లా హజ్ సొసైటీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. యాత్రలో వాతావరణ మార్పులను తట్టుకునేందుకు, అంతర్జాతీయ నిబంధనల ప్రకారం ప్రతీ యాత్రికుడు తప్పనిసరిగా వ్యాక్సిన్ తీసుకోవాలని, ఆరోగ్య నియమాలను పాటించాలని సూచించారు. క్యాంప్ విజయవంతం కావడానికి సహకరించిన ఆంధ్రప్రదేశ్ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వ్యాక్సినేషన్ సిబ్బంది, అతిథులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ హజ్ కమిటీ సభ్యులు నూరి మన్సూర్ అలీఖాన్, హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షేక్ మహమ్మద్ గౌస్ పీర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్. వెంకటరమణ, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ సి. సుదర్శన్ బాబు, ప్రసన్న లక్ష్మి, నేషనల్ కాలేజీల సెక్రటరి రఫీ అహ్మద్, మౌలానా అబ్దుల్ హాదీ, మౌలానా మహబూబ్ బాషా, హాఫిజ్ షరీఫ్, షబ్బీర్, రఫీ, హజ్ కమిటీ ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ కార్యక్రమం.




**శిరివెళ్ళ. (డ్రీమ్ టైమ్స్ న్యూస్)**
మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్య అధికారులు ముఖేష్ ఆంజనేయులు ,ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా రెండవ మరియు మూడవ త్రైమాసికం గర్భిణీలకు ప్రతినెల 9వ తేదీన అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో కార్యక్రమము నిర్వహించబడుతుందని,గర్భిణీలకు ఉచిత పరీక్షలు బిపి ,బ్లడ్ షుగర్ హిమోగ్లోబిన్ ,యూరిన్ ఆల్బుమిన్ ,వి డి ఆర్ ఎల్ హెచ్బీఎస్ ఏజీ ,బ్లడ్ గ్రూపింగ్ హెచ్ఐవి మొదలైన బేసిక్ లాబరేటరీ పరీక్షలు ఎత్తు బరువు మరియు పొట్ట పరీక్షించడం లాంటి సాధారణ పరీక్షలు మరియు చికిత్స నిర్వహించ బడుతుందని తెలిపారు. గర్భిణీల ఆరోగ్య సంరక్షణ మరియు మాతా శిశు మరణాల రేటును తగ్గించడం హైరిస్క్ ప్రెగ్నెన్సీ గుర్తించడం, బర్త్ ప్లానింగ్, చైల్డ్ కేర్ గురించి తెలియజేయడం చికిత్స అందించడం లక్ష్యంగా కార్యక్రమము నిర్వహించ బడుతుందని తెలిపారు. మరియు గర్భవతులకు పోషకాహారం రక్తహీనత ఆరోగ్య సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 40 మంది గర్భిణీలు సేవలు ఉపయోగించుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రామ్మోహన్ రెడ్డి పిహెచ్ఎన్ సరస్వతి , స్టాఫ్ నర్సులు,ఆరోగ్య సిబ్బంది ఆశ కార్యకర్తలు గర్భిణీలు మరియు బయట నుండి వచ్చే రోగులు పాల్గొన్నారు. ఈ పరీక్షలను బట్టి హై రిస్క్ ప్రెగ్నెన్సులను గుర్తించి చికిత్స చేయడం జరుగుతుందని సూచించారు.

## ఇసుక ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి



**మంత్రాలయం, ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
ఇసుక ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మంత్రాలయం మండలం చెట్నేహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు మరియు మంత్రాలయం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... చెట్నేహళ్లి గ్రామానికి చెందిన రాఘవేంద్ర అనే యువకుడు ట్రాక్టర్ కు డ్రైవర్ గా పని చేస్తున్నాడు. సోమవారం అదే గ్రామానికి చెందిన బోయ భీమయ్య ట్రాక్టర్ కి తుంగభద్ర నది లో నుంచి ఇసుక రవాణా చేసే సమయంలో దారిలో అదుపు తప్పి పక్కనే ఉన్న లోతైన గుంతలో బోల్తా పడింది. డ్రైవర్ రాఘవేంద్ర ట్రాక్టర్ ఇంజన్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, తోటి డ్రైవర్లు జేసీబీ సహాయంతో రాఘవేంద్ర మృత దేహాన్ని బయటకు తీసి పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న వయసులోనే మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.


# ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, పంపిణీ చేసిన డిసిఎంఎస్ చైర్మన్ జయ ప్రకాష్

**రైల్వే కోడూరు ఫిబ్రవరి 9 డ్రీమ్స్ టైమ్స్**
రైల్వే కోడూరు పట్టణంలోని ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో సోమవారం డిసిఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్ పదవ తరగతి చదువుతున్న బాలికలకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే కోడూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థినీ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పెన్నులు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు మధ్యతరగతి కుటుంబానికి చెందిన వారు అధికంగా ఉంటారని వారికి ఈ ఫ్యాట్స్ ఎంతో ఉపయోగపడతాయని పంపిణీ చేశామన్నారు. అలాగే ప్రతి ఒక విద్యార్థి రాబోవు 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఇప్పటినుండే



ప్రణాళిక రూపొందించుకొని ప్రతి సబ్జెక్టులోనూకష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చి మన రైల్వే కోడూరు మండలానికి పదవ తరగతి మార్కులలోముందు ఉంటారని కొనియాడారు అలా పదవ తరగతి మార్కులు అధికంగా వచ్చిన విద్యార్థులకు విద్యార్థినీ ,విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఇప్పటినుండే టీవీలు పెట్టక విద్యార్థులకు సెల్ ఫోన్లు ఇవ్వక చదువుపై వారు దృష్టి పెట్టడానికి అవకాశం ఇవ్వాలన్నారు. అలాగే చదువులతో పాటు క్రీడల్లో కూడా పాల్గొని బహుమతులు పొందాలన్నారు. అలాంటి వారికి ఉద్యోగాల్లో కూడా రిజర్వేషన్లు ఉంటుందని తెలిపారు. కావున ప్రతి ఒక్క విద్యార్థి కష్టపడి చదివి మంచి ఉద్యోగాలు పొంది వారి కుటుంబాలకు వెలుగు నింపుదరని కొనియాడారు ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరుటౌన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పోకల మణి, క్లస్టర్ ఇంచార్జ్ పటాన్ మౌలా, పుష్పలత, నాగమణి,రాజశేఖర్, సయ్యద్ ముహతాజ్ బేగం, శివయ్య, హెడ్మాస్టర్ సి. రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ గా ఓబులే సు



**ఆత్మకూర్,**
**ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
ఆత్మకూరు మున్సిపల్ ఇంచార్జ కమిషనర్ గా అవుకు ఓబులేసును నియమిస్తూ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో మున్సిపల్ కమిషనర్ గా పనిచేసిన రమేష్ బాబు అవినీతి ఆరోపణలతో ఏసీబీకి చికడంతో ఆయనపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు పట్టణ అభివృద్ధి, మున్సిపల్ కార్యాలయం సంబంధించిన కార్యకలాపాలు కుంటు పడకుండా ఉండేందుకు మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్ గా పనిచేస్తున్న ఇంచార్జ్ కమిషనర్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఓబులేసు ఇంచార్జ్ కమిషనర్ గా సోమవారం బాధ్యతలు చేపట్టారు.

# గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ



**బనగానపల్లె, ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో 100 మంది గర్భిణీ మహిళలకు డాక్టర్ శిరీష పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు సోమవారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో టిడిపి నాయకురాలు బీసీ ఇందిరా రెడ్డి సొంత నిధులతో 100 మంది గర్భిణీ ,బాలింత మహిళలకు ఉచితంగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు.పుట్టబోయే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో, శారీరక,మానసిక వికాసంతో ఎదగాలంటే గర్భిణీ స్త్రీలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని బీసీ ఇందిరా రెడ్డి అన్నారు.పోషకాహార లోపం కారణంగా గర్భిణీ స్త్రీలు రక్తహీనత వంటి సమస్యలకు గురై, ప్రసవ సమయంలో అనేక సంక్లిష్టతలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, తల్లిబిడ్డల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రతి నెల 9వ తేదీన వైద్యశాలలో పరీక్షల కోసం వచ్చే గర్భిణీ మహిళలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. గర్భిణీ స్త్రీలకు సరైన పోషకాహారంపై అవగాహన కల్పించడం, వారికి అవసరమైన పోషకాలు అందించడం ద్వారా మాత్రమే ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించవచ్చని ఆమె పేర్కొన్నారు. ప్రతి నెల 9వ తేదీన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి గారి సొంత నిధులతో గర్భిణీ స్త్రీలకు ఉచితంగా పౌష్టికాహారం పంపిణీ చేయడం ఒక సదాచారంగా కొనసాగుతూ వస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా తల్లులకు ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు, పుట్టబోయే శిశువుల శారీరక ఎదుగుదల మరింత బలపడుతుందని అన్నారు.

# శ్రీ మఠంలో గుంతకల్లు ఎమ్మెల్యే



**మంత్రాలయం, ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామిని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను, శ్రీ రాఘవేంద్ర స్వామి మూలబృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీ మఠం పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామి వారు శేష వస్త్రం కప్పి ఫలమంత్రాక్సితలు ఆశీర్వాదించారు. అంతకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈయనతో పాటు మంత్రాలయం సీఐ రామంజులు తదితరులు ఉన్నారు

# గుమ్మనూరు జయరాం కి సన్మానం చేసిన ఎల్ ఎల్ సీ చైర్మన్ నరసింహ.

**మంత్రాలయం,**
**ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**



అనంతపురం జిల్లా.. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోమవారం శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంత్రాలయం వచ్చారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కు ఎల్ ఎల్ సీ డీసీ 5 ఛైర్మెన్ బోయ నరసింహ శాలువా కప్పి, శ్రీ రాఘవేంద్ర స్వామి మెమోంటో అందజేసి సన్మానించారు. అనంతరం పలు విషయాల పై చర్చించారు.

# ఫక్రుద్దీన్ మృతి పార్టీకి తీరని లోటు

## రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బత్తిన కుబేర్ నాథ్



**ఆదోని ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
ఆదోని టిడిపి సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్, సాంబగల్ నేత, ముస్లిం మైనార్టీ నాయకులు ఫక్రుద్దీన్ మృతి పార్టీకి తీరని లోటు అని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుబేర్నాథ్ అన్నారు. సోమవారం ఫక్రుద్దీన్ మృతి చెందిన విషయాన్ని తెలిసిన వెంటనే కుబేర్నాథ్ ఆయన ఇంటికి వెళ్లి భౌతిక గాయానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ముందుగా కుబేర్నాథ్ ఫక్రుద్దీన్ కుమారులకు వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి ఫక్రుద్దీన్ చేసిన సేవలను ఆయన కొనియాడారు. మంచి నాయకుడిని తెలుగుదేశం పార్టీ కోల్పోయిందని అన్నారు.

# రెడ్ క్రాస్ సేవలు విస్తృత పరుస్తాం

## - మండల తాసిల్దార్ నారాయణ రెడ్డి



**బనగానపల్లె, ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
రెడ్ కాసేవలను విస్తృత పరుస్తామని తహసిల్దార్ ,రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ నారాయణ పేర్కొన్నారు సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బనగానపల్లె సబ్ బ్రాంచ్ కు నూతన కమిటీ ని ఎన్నుకున్నారు.నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ , కలెక్టర్ రాజకుమారి గనియ ఆదేశాల మేరకు, జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల సహకారంతో జిల్లాలోని అన్ని మండలాల్లో సబ్ బ్రాంచ్ కమిటీలను ఏర్పాటు చేయాలనే నిర్ణయంలో భాగంగా బనగానపల్లె మండల రెడ్ క్రాస్ సభ్యులందరితో సమావేశం ఏర్పాటు చేసి జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల ఆధ్వర్యంలో కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. మండల తాసిల్దార్ నారాయణ రెడ్డి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బనగానపల్లె మండల సబ్ బ్రాంచ్ కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రెసిడెంట్ గా ఎమ్మార్వో బి.నారాయణ రెడ్డి, చైర్మన్ ఎస్.సైఫుల్లా, వైస్ చైర్మన్ బి.హనుమంతు, సెక్రటరీ ఎస్.అమీర్ బాష, ట్రెజరర్ బి.పరమేశ్వరుడు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లుగా ఎన్.సత్యనారాయణ, జి.నాగమణి, ఎస్.దాదా ఖాజా పీర్, మేనేజింగ్ కమిటీ మెంబర్లుగా వై.బలరాముడు, జి.ఎస్.నాగప్ప, బి.సాదక్ బాష లను ఎన్నుకున్నారు. మండల రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ తహసిల్దార్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ కలెక్టర్ సహకారంతో మండలంలో రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు.

# వైసీపీ పాలనలో పాలు లేకుండా నెయ్యి తయారు చేశారు

**బనగానపల్లె, ఫిబ్రవరి 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
వైసిపి పాలనలో తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డుకు వాడే నీ నెయ్యికి పాలు లేకుండా కత్తి నెయ్యిని తయారుచేసి కల్తీ లడ్డును భక్తులకు పంపిణీ చేశారని టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, పట్టణ ఉప సర్పంచ్ బురానుద్దీన్ లు తెలిపారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో నెయ్యిలో కల్తీ జరిగిందని, ఆ కల్తీ నెయ్యితోనే స్వామి వారికి ప్రసాదాలు తయారుచేసి పంపిణీ చేసినట్లు సిట్ దర్యాప్తులో బట్టబోయిలిందన్నారు. వైసీపీ నేతలు సమాధానం చెప్పకుండా ఎదురు దాడి చేస్తున్నారని విమర్శించారు. దేవుడి ప్రసాదంలో కల్తీ జరిగిందని గుట్టు రట్టు కావడంతో వైసిపి ముఠా ఎదురుదాడి చేస్తుందని విమర్శించారు. చుక్క పాలు లేకుండా పూర్తి రసాయనాలతో వైసిపి పాలనలో నెయ్యి తయారు చేసి కోట్లాది లడ్డులు సరఫరా చేశారని, నెయ్యిలో కల్తీ జరగలేదని




వైసీపీ నాయకులు ప్రమాణం చేయగలర అని ప్రశ్నించారు. వైసీపీ 5 సంవత్సరాల పాలనలో 1.61 కోట్ల కిలోల నెయ్యి కొనుగోలు చేయగా అందులో1. 60 కోట్ల కిలోల కల్తీ నెయ్యి తో శ్రీవారి లడ్డులు ,ఇతర ప్రసాదాలు తయారు చేశారని విమర్శించారు. చిన్నప్ప బ్యాంకు ఖాతాల్లో 2019 నుంచి 2024 వరకు నా 4.69 కోట్ల రూపాయలు మళ్లించారని, ఎవరు పంపించారని ప్రశ్నించారు. తిరుమల తిరుపతిని అక్రమాల పుట్టగా మార్చుకొని వైసీపీ నాయకులు దోచుకున్నారని విమర్శించారు. తిరుమల తిరుపతిలో వైసీపీ పాలనలో రూ 235 కోట్ల అక్రమాలకు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం టెండర్ల లో పాల్గొనే డైరీలు పాలు సేకరించాల్సిన పనిలేదని వెన్న సేకరణ ,నెయ్యి ఉత్పత్తి సామర్థ్యాలతో సంబంధం లేదని డైరీ మూడేళ్ల కార్యక్రమాలు చేయవచ్చని టెండర్లు పిలిచారని తెలిపారు. వైసిపి ఐదు సంవత్సరాలు హిందూ మతంపై దాడి చేశారని తెలిపారు. ఇప్పటికైనా కల్తీ చేసిన వారు తమ తప్పును తెలుసుకొని స్వామివారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ బి సి డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ జిల్లెల్ల రాజశేఖర్ రెడ్డి, టిడిపి ముస్లిం మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాయలసీమ సలాం, టిడిపి నాయకులు ఎర్రబోలు పవన్ కుమార్ రెడ్డి, చెరువు పల్లె శరత్ కుమార్ ,తలారి తిరుమలయ్య, చిన్న రాజుపాలెం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# రూ 1.58 లక్షలకు బంగారం..

### మరో రూ1,500 వరకు పెరిగిన తులం ధర



న్యూఢిల్లీ,
బంగారం ధరలు మళ్లీ పుంజుకుంటున్నాయి. గత వారంలో భారీగా తగ్గిన అతి విలువైన లోహాలు మళ్లీ అదే వేగంతో దూసుకుపోతున్నాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో వెండి ధరలు ఆరు శాతం బలపడగా, పసిడి ధరలు ఒక్క శాతం చొప్పున ఎగబాకాయి. సోమవారం కిలో వెండి ఏకంగా 6 శాతం లేదా రూ.17 వేలు ఎగబాకి రూ.2.72 లక్షలు పలికింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల పుత్తడి ధర రూ.1,300 అందుకొని రూ.1,58,500 పలికింది.ఇటు హైదరాబాద్ బులియన్ మార్కెట్లో గోల్డ్ ధర రూ.2 వేల వరకు అధికమై రూ.1.61 లక్షలకు చేరుకున్నది. గ్లోబల్ మార్కెట్లో ధరలు భారీగా పుంజుకోవడం, అమెరికా డాలర్ బలహీనంగా ట్రేడవుతుండటం వల్లనే ధరలు పుంజుకుంటున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తరచుగా పాలసీలను మార్చడం కూడా ధరలు పుంజుకోవడానికి ప్రధాన కారణమన్నారు. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ వెండి 2.19 డాలర్లు లేదా 2.81 శాతం పెరిగి 80.21 డాలర్లకు చేరుకోగా, బంగారం 5 వేల డాలర్లు అధిగమించింది.

# మార్కెట్లో కొనసాగిన లాభాలు.. 84 వేల పైకి సెన్సెక్స్, 26 వేలకు చేరువైన నిఫ్టీ

**ముంబై, ఫిబ్రవరి 9**
దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజూ లాభాల్లో ముగిశాయి. అమెరికా-భారత్ దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారు కావడంతో మదుపరుల్లో జోష్ పెంచింది. ఫలితంగా అన్ని రంగాల షేర్లు కదంతొక్కాయి. గత కొన్ని నెలలుగా టారిఫ్‌ల విధింపుపై నెలకొన్న అనిశ్చితి ముగింపు పలకడంతో సోమవారం ప్రారంభం నుంచే లాభాలబాట పట్టిన సూచీలు చివరి వరకు అదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 84 వేల పాయింట్ల పైకి చేరుకున్నది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 485.35 పాయింట్లు అందుకొని 84,065.75 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 26 వేల పాయింట్లకు చేరువైంది. 173.60 పాయింట్లు ఎగబాకి 25,867.30 వద్ద స్థిరపడింది. ట్రేడ్ డీల్ మదుపరుల్లో ఉత్సాహాన్ని నింపిందని, అలాగే విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడం సెంటిమెంట్‌ను మరింత



మెరుగుపరిచిందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. కార్పొరేట్ల మూడో త్రైమాసికపు ఆర్థిక ఫలితాలపై మదుపరులు దృష్టిసారించడం, ప్రభుత్వరంగ బ్యాంకులు అంచనాలకుమించి రాణించడం కూడా కలిసొచ్చింది. ఇటీవల కరెక్షన్‌కు గురైన రియల్ ఎస్టేట్, కన్స్యూమర్ డ్యూరబుల్ షేర్లు తిరిగి కోలుకోవడం సూచీల్లో జోష్ పెంచిందన్నారు.

**తీవ్ర ఒత్తిడిలో ఐటీ షేర్లు**
దేశీయ ఐటీ స్టాక్‌లు తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఏఐ ఆటోమేషన్ సంప్రదాయ అవుట్‌సోర్సింగ్ మాడల్ అందుబాటులోకి రావడం, ముఖ్యంగా ఈఆర్‌పీ అమలుతో ఈ రంగాలను దెబ్బతీస్తుందనే భయాలు నెలకొన్నాయి. దీంతో గత మూడు రోజుల్లో ఐటీ రంగ సూచీ 8 శాతం నష్టపోవడంతో ఆయా సంస్థల మార్కెట్ విలువ రూ.2.5 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. ఈఆర్‌పీ మాడల్ ఐటీ సంస్థల ఆదాయాన్ని 30-40 శాతం రిస్క్‌లో పడే అవకాశాలున్నాయని మోతీలాల్ ఒస్వాల్ అంచనావేస్తున్నారు.

# హోండాకార్లపై 2 లక్షల డిస్కౌంట్

**న్యూఢిల్లీ,**
కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి వాహన తయారీ సంస్థలు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే ఎక్స్చేంజ్ ఆఫర్లతోపాటు డిస్కౌంట్ అంటూ ఊదరగొడుతున్నాయి. తాజాగా ఈ జాబితాలోకి జర్మనీకి చెందిన హోండా కూడా చేరింది. ప్రస్తుత నెలలో హోండా తన మాడళ్ల ధరలను రూ.2 లక్షల వరకు తగ్గింపు ధరతో విక్రయిస్తున్నట్టు ప్రకటించింది.వీటిలో సిటీ, అమేజ్, ఎలివేటివ్ మాడళు ఉన్నాయి. సిటీ, అమేజ్‌లపై రూ.1.97 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తున్నది. ఈ నెల చివరి వరకు మాత్రమే ఈ ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉండనున్నాయి. ఈ ఆఫర్లలో నగదు డిస్కౌంట్లు, ఎక్స్చేంజ్, స్క్రాపేజ్ ప్రయోజనాలు, లాయల్టీ బోనస్‌లతో పాటు ఇతర ప్రయోజనాలు కూడా కల్పించనున్నది.




## స్పోర్ట్స్

# సఫారీల ధనాధన్.. కెనడాపై అలవోక విజయం

### మెరిసిన మార్క్‌రమ్, ఎంగిడి

అహ్మదాబాద్:
గత ఎడిషన్ రన్నరప్ దక్షిణాఫ్రికా టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ వేటను ఘనంగా ఆరంభించింది. బ్యాట్‌తో పాటు బంతితోనూ చెలరేగి పసికూన కెనడాపై భారీ విజయాన్ని నమోదుచేసింది. టైటిల్ ఫేవరేట్లుగా ఉన్న సఫారీలు.. కెనడాపై 57 పరుగుల తేడాతో గెలిచారు. కెప్టెన్ ఎయిడెన్ మార్క్మ (32 బంతుల్లో 59, 10 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకానికి తోడు డేవిడ్ మిల్లర్ (23 బంతుల్లో 39, 1 ఫోర్ , 3 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (19 బంతుల్లో 34, 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), రికెల్టన్ (21 బంతుల్లో 33, 3 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ మెరుపులతో ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 213 పరుగుల భారీ స్కోరు చేసింది. అంతగా అనుభవం లేని కెనడా బౌలర్లపై ఆదినుంచే విరుచుకుపడ్డ మార్క్మ,?ర డికాక్ (25) జోడీ.. 7 ఓవర్లలోనే 70 రన్స్ జోడించి శుభారంభం అందించింది.
సఫారీ సారథి బౌండరీల వర్షం కురిపించాడు. హాఫ్ సెంచరీ అనంతరమే అతడు నిష్క్రమించగా రికెల్టన్,




బ్రెవిస్ వికెట్లను ఒకే ఓవర్లో కోల్పోయినా ఆఖర్లో మిల్లర్, స్టబ్స్ మెరుపులు మెరిపించి ఆ జట్టుకు భారీ స్కోరునందించారు. కెనడా బౌలింగ్‌ను తుత్తునీయలు చేస్తూ ఈ ఇద్దరూ సిక్సర్లతో స్టేడియాన్ని హోరెత్తించారు. అనంతరం ఛేదనలో సౌతాఫ్రికా బౌలర్ల ధాటికి గజగజలాడి 20 ఓవర్లకు 156/8కే పరిమితమైంది. తొలి స్పెల్‌లోనే 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' లుంగి ఎంగిడి (4/31) నిప్పులు చెరిగే బంతులతో 3 కీలక వికెట్లు తీసి కెనడాను కోలుకోనీయకుండా చేశాడు. అయితే నవ్‌నీత్ ధలివాల్ (49 బంతుల్లో 64, 7 ఫోర్లు, 1 సిక్స్), హర్ష్ ఠాకర్ (29 బంతుల్లో 33, 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) సఫారీల బౌలింగ్ దాడిని సమర్థవంతంగా ఎదుర్కోవడమే గాక ఐదో వికెట్‌కు 69 రన్స్ జోడించి ఆ జట్టు పరువు కాపాడారు.
1 టీ20 ప్రపంచకప్‌లో అత్యధికసార్లు 200ం స్కోరు చేసిన జట్లలో దక్షిణాఫ్రికా (6) అగ్రస్థానంలో ఉంది. భారత్, వెస్టిండీస్ మూడుసార్లు ఈ ఘనత సాధించాయి.
సంక్షిప్త స్కోర్లు:
దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 213/4 (మార్క్మ 59, మిల్లర్ 39, అన్ష్ పటేల్ 3/31, దిల్‌ప్రీత్ 1/40);
కెనడా: 20 ఓవర్లలో 156/8 (నవ్‌నీత్ 64, హర్ష్ 33, ఎంగిడి 4/31, యాన్సెన్ 2/26)

# జింబాబ్వే శుభారంభం




**కొలంబో**
టీ20 మెగాటోర్నీలో జింబాబ్వే తమ ప్రస్థానాన్ని ఘనంగా మొదలుపెట్టింది. సోమవారం జరిగిన గ్రూపు-బీ పోరులో జింబాబ్వే 8 వికెట్ల తేడాతో(39 బంతులు మిగిలుండగానే) ఒమన్‌పై భారీ విజయాన్నందుకుంది. టాస్ గెలిచిన జింబాబ్వే.. ఒమన్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. బ్లెసింగ్ ముజర్బని (3/16), రిచర్డ్ నగ్వార (3/17), బ్రాడ్ ఇవాన్ (3/18) ధాటికి ఒమన్ 19.5 ఓవర్లలో 103 పరుగులకే కుప్పకూలింది. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ జింబాబ్వే బౌలర్లు ఆది నుంచే చెలరేగారు. దీంతో ఒమన్ 27 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది.వికెట్‌కీపర్, బ్యాటర్ వినాయక్ శుక్లా (28), సుఫియాన్ మహమ్మద్ (25) అంతోఇంతో జింబాబ్వే దాడిని ప్రతిఘటించారు. ఆ జట్టులో ఎనిమిది మంది బ్యాట ర్లు సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితమయ్యారు. ఆ తర్వాత జింబాబ్వే 13.3 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదనను పూర్తిచేసింది. ఓపెనర్ బ్రియాన్ బెనెట్ (48ి), బ్రెండన్ టేలర్ (31) రాణించారు. జింబాబ్వే విజయంలో కీలకంగా వ్యవహరించిన ముజర్బనికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

# షరతులు వర్తిస్తాయి!.. భారత్‌తో ఆడేందుకు పాక్ కొర్రీలు

### 48 గంటల్లో తెలుస్తుందన్న నఖ్వీ

**కరాచీ**
టీ20 ప్రపంచకప్‌లో భారత్, పాక్ మ్యాచ్ జరుగుతుందా? లేదా? అన్నదానిపై అనిశ్చితి కొనసా..గుతూనే ఉంది. ఆర్థికంగా భారీ నష్టం వాటిల్లబోయే (మ్యాచ్ రైద్దతే) ఆస్కారమున్న నేపథ్యంలో ఐసీసీ ఈ మ్యాచ్‌ను ఎలాగైన నిర్వహించాలని చూస్తున్నా.. పాకిస్థాన్ మాత్రం తాము ఆడతాం కానీ తమ డిమాండ్లను నెరవేరిస్తేనే మ్యాచ్‌పై పునరాలోచిస్తామని ఐసీసీ ప్రతినిధికి వివరించినట్టు సమాచారం. కరాచీలో జరిగిన చర్చల్లో పాక్ బోర్డు..



ఐసీసీ ఎదుట పలు డిమాండ్లను ఉంచినట్టు తెలుస్తున్నది.అందులో ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో క్రికెట్ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు ఇవ్వడం, ప్రపంచకప్ ఆడనప్పటికీ ఆ దేశానికి పార్టిసిపేషన్ ఫీజు మంజూరు చేయడం, ఐసీసీ ఫ్యూచర్ టూర్స్‌లో బంగ్లాకు ఆతిథ్య హక్కులు అందించడం, భారత్-పాక్-బంగ్లాదేశ్‌తో ముక్కోణపు సిరీస్, భారత్-పాక్ ద్వైపాక్షిక సిరీస్‌ల పునరుద్ధరణ వంటివి ప్రతిపాదించినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. వీటిలో చాలావరకూ ఐసీసీ పరిధిలోనివి కాకుండా భారత ప్రభుత్వం, బీసీసీఐ చేతిలో ఉన్నవే కావున ఆ విషయంలో ఐసీసీ నిస్సహాయంగానే ఉండే అవకాశాలున్నాయి. ఇదిలాఉండగా రాబోయే 48 గంటల్లో భారత్, పాక్ మ్యాచ్ భవితవ్యం తేలనుందని పీసీబీ చీఫ్ మోహ్సిన్ నఖ్వీ వ్యాఖ్యానించడం గమనార్హం. ఐసీసీ, పీసీబీతో చర్చల్లో పాల్గొన్న బంగ్లా క్రికెట్ బోర్డు చీఫ్ అమినుల్ ఇస్లాం సైతం.. పాక్, భారత్‌తో మ్యాచ్ ఆడాలని సూచించడం విశేషం.






## 600 మంది డ్యాన్సర్లు..
## అదిరిపోయేలా నాని ది ప్యారడైజ్ ఇంట్రో సాంగ్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ నాని నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ది ప్యారడైజ్. దసరా ఫేం శ్రీకాంత్ ఓదెల డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రంలో మోహన్ బాబు, తనికెళ్లభరణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన నాని, మోహన్ బాబు పోస్టర్లు, గ్లింప్స్ నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. త్వరలోనే మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలు కానున్నాయి.ది ప్యారడైజ్ నుంచి ఫస్ట్ సింగిల్‌ఝుఝుఝూస్త్రవతీ ఇంట్రో సాంగ్ రానుందని తెలిసిందే. ప్రస్తుతం నాని ఇంట్రడక్షన్ సాంగ్‌కు సంబంధించిన ఆసక్తికర వార్త తెరపైకి వచ్చింది. ఈ పాటను చాలా గ్రాండ్‌గా తెరకెక్కిస్తుందట శ్రీకాంత్ ఓదెల టీం. అనిరుధ్ కంపోజిషన్‌లో వచ్చే ఈ పాటకు ఏకంగా 600 మంది డ్యాన్సర్లు స్టెప్పులేయబోతున్నారన్న న్యూస్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. సుధాన్ మాస్టర్ కొరియోగ్రఫీలో తెరకెక్కుతున్న ఈ సాంగ్ టాలీవుడ్ చరిత్రలోనే బిగ్గెస్ట్ ఇంట్రో సాంగ్‌గా ఉండబోతుందట. నాని బర్త్ డే సందర్భంగా శ్రీకాంత్ ఓదెల ట్రీట్ ఎలా ఉండబోతుందోనని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అభిమానులు. మాస్ బ్యాంగర్‌గా ఉండబోతున్న సినిమాకే హైలెట్‌గా నిలిచిపోనుందని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. మొత్తానికి నాని ఈ సారి ఏదో గట్టి ప్లానే రెడీ చేసుకున్నాడని తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది. ది ప్యారడైజ్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి సోనాలి కులకర్ణి కీ రోల్‌లో నటిస్తుండగా.. కిల్ ఫేం రాఘవ్ జుయల్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఓ వైపు బ్లాక్ బస్టర్ దసరా కాంబో రిపీట్ అవడం, మరోవైపు జెర్సీ, గ్యాంగ్ లీడర్ తర్వాత నాని-అనిరుధ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో ది ప్యారడైజ్‌పై క్యూరియాసిటీ పెరిగిపోతుంది.

## 11న నెట్‌ఫ్లిక్స్‌లో
## అనగనగా ఒకరాజు

నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు'.. సంక్రాంతి కానుకగా.. జనవరి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయంతో పాటు కలెక్షన్స్ కూడా సాధించింది. ఈ సినిమాకు మారి దర్శకత్వం వహించగా.. సితార ఎంటర్‌టైన్ మెంట్స్ నిర్మించిన ఈ మూవీలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించింది. ఈ మూవీ ప్రముఖ ఓటీటీ ప్లలాట్‌ఫామ్ నెట్‌ప్లిక్స్‌లో స్ట్రీమింగ్‌కు సిద్ధంగా ఉంది. ఫిబ్రవరి 11నుండి ఈ సినిమా అందుబాటులోకి రానున్నట్లు నెట్‌ప్లిక్స్ అఫీషియల్‌గా అనౌన్స్ చేసింది. 'రాజుగారి పెళ్లంటే ఏడు తరాలు అటు ఇటు గుర్తుండిపోవాలి' అని స్పెషల్ పోస్టర్ షేర్ చేశారు.



## ఆ సమయంలో చాలా ఏడ్చా..
### ఎమోష్నలైన యంగ్ బ్యూటీ కాయదు లోహర్

కాయదు లోహర్.. డ్రాగన్ సినిమాతో ఒక్కసారిగా సెన్సేషన్ గా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. కాయదు లోహర్.. మోడల్ గా కెరీర్ మొదలు పెట్టి ఆతర్వాత హీరోయిన్ గా మారింది. తన నటనతో ఈ చిన్నది మంచి ఫాలోయింగ్ సొంతం చేసుకుంది. ఆమె 2000 ఏప్రిల్ 11న అస్సాంలోని తేజ్‌పూర్‌లో జన్మించింది. ఇక తెలుగులో ఈ బ్యూటీ అల్లూరి అనే సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. ఈ సినిమ తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు తెలుగులో బిజీ కానుంది. ప్రస్తుతం విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న ఫంకీ సినిమలో హీరోయిన్ గా చేస్తుంది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ సినిమా ప్రమోషన్స్ లో బిజీగా ఉంది కాయదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను పంచుకుంది. నటి కాయదు లోహర్ తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యింది. మోడలింగ్ రంగం నుంచి సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టి ప్రస్తుత స్థాయికి చేరుకోవడం వెనుక తన కృషి, పట్టుదల ఉన్నాయని తెలిపింది ఈ ముద్దుగుమ్మ.. తన కెరీర్ ఆరంభంలో, కొన్ని సంవత్సరాల క్రితం, ఒకానొక సమయంలో తాను బాల్కనీలో కూర్చుని ఆలోచిస్తూ, "ఏమవుతోంది? ఏదీ వర్కవుట్ అవ్వడం లేదు. అంతా చాలా నెమ్మదిగా ఉంది. నేను దీన్ని చేయగలనో లేదో నాకు తెలియదు" అని నిరాశకు లోనయ్యానని గుర్తు చేసుకుంది కాయదు. తనలో పని చేయాలనే శక్తి, తనను తాను నిరూపించుకోవాలనే తపన ఉన్నప్పటికీ సరైన అవకాశాలు లభించలేదని తెలిపింది. మోడలింగ్ చేసేటప్పుడు, కాలేజీలో ఉన్నప్పుడు తాను ఈ పరిశ్రమలో ఉండాలని అనుకున్నా.. ఆ లక్ష్యాన్ని సాధించడం కోసం నిరంతరం శ్రమించానని తెలిపింది. తనకు తెలిసింది ఒకటేనని, కష్టపడాలి, చిత్తశుద్ధితో ఉండాలి, చాలా బాధ్యతగా వ్యవహరించాలి.. పరిశ్రమలో తనకంటూ ఎలాంటి అండదండలు లేవని, పరిచయస్తులు గానీ, అవకాశాలు ఇచ్చే కుటుంబ సభ్యులు గానీ లేరని చెప్పుకొచ్చింది. ప్రతి ప్రాజెక్ట్, ప్రతి ఆడిషన్ కోసం తనను తాను నిరూపించుకోవాల్సి వచ్చిందని, ఇతరుల కంటే వంద శాతం ఎక్కువ కష్టపడాల్సి వచ్చిందని తెలిపింది.కొన్ని రోజులు ఎంత కష్టపడినా ఫలితం కనిపించక, ఏమి చేయాలో తెలియక చాలా బాధపడ్డానని, డిప్రెషన్‌లో కూడా ఉన్నానని, అనేక భావోద్వేగాలను ఎదుర్కొన్నానని తెలిపింది కాయదు. పెద్ద ప్రాజెక్టులు, ఆడిషన్స్‌లో అవకాశాలు కోల్పోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అప్పుడు తనకు భాషపై అంత పట్టు లేకపోవడం ఒక కారణమని చెప్పుకొచ్చింది. ఆడిషన్‌కు కేవలం గంట ముందు డైలాగులు ఇచ్చేవారని, భాషను సులభంగా గ్రహించేంత స్మార్ట్‌గా తాను లేనందున చాలా అవకాశాలు చేజారిపోయాయని.. ఆ సమయంలో చాలా బాధపడి, ఏడ్చానని, కానీ జరిగినవన్నీ సరైన కారణాలకే జరిగాయని తాను నమ్ముతున్నానని కాయదు చెప్పుకొచ్చింది.



## అదిరేటి డ్రెస్‌లో అందాల సెగలు..
## హెబ్బా ఏముందబ్బా!

టాలీవుడ్ బ్యూటీ హెబ్బా పటేల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ అమ్మడు అందం, అభినయానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. ముఖ్యంగా ఈ బ్యూటీ ఒక్క సినిమాతోనే యూత్‌లో విపరీతమైన పాపులారిటీ సంపాదించుకుంది. మొదటి సినిమాతోనే తన నటన, గ్లామర్‌తో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది.అలా ఎలా సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమై చిన్నది హెబ్బా పటేల్. ఈ మూవీలో ఈ అమ్మడు తన అందంతో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. అంతే కాకుండా మూవీ కూడా పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. ఇక ఈ మూవీ తర్వాత అమ్మడుకు అవకాశాలు క్యూ కట్టాయనే చెప్పాలి.అలా ఎలా తర్వాత ఈ ముద్దుగుమ్మ కుమారి 21 ఎఫ్‌లో నటించి, ఈ మూవీలో ఈ బ్యూటీ గ్లామర్‌తో కుర్రకారుకు చెమటలు పట్టించిందనే చెప్పాలి. ఈ మూవీతో ఒక్కసారిగా యూత్ క్రష్ అయిపోయింది. దీంతో ఈ చిన్నదానికి టాలీవుడ్‌లో వరసగా ఆఫర్స్ వచ్చాయి. అయినా కానీ ఈ అమ్మడుకు అదృష్టం కలిసి రాలేదనే చెప్పాలి.దీని తర్వాత ఎక్కడికి పోతావు చిన్న వాడ, నాన్న నేను నా బాయ్ ఫ్రెండ్స్, ఈడో రకం, వాడో రకం, ఏంజిల్, 24 కిసెస్, మిస్టర్ , ఓదెల , ఓదెల 2 ఇలా చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. కానీ ఈ బ్యూటీ మాత్రం స్టార్ హీరోల సినిమాల్లో నటించే ఛాన్స్ అందుకోలేకపోయింది. అంతే కాకుండా, గ్లామర్ ఉన్నా కూడా అంతా సక్సెస్ అవ్వలేకపోతుంది.ఇక సినిమాల విషయం ఎలా ఉన్నా, ఈ బ్యూటీ నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ, తన అంద చందాలతో ప్రతి ఒక్కరి మనసు దోచేసుకుంటుంది. తాజాగా ఈ బ్యూటీ అదిరిపోయే డ్రెస్‌లోని క్యూట్ ఫొటోస్ షేర్ చేసింది. ప్రస్తుతం ఇవి నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831